



నిష్పక్షపాత నిర్భయ... [masthead tagline]
22ND ANNIVERSARY
వసంతాల ఆత్మగౌరవం 2004-2026

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

బుధవారం 15-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 100 రూ॥ 6.00






చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


# ఎన్నికల సునామీ హరీష్

# ఎదురు ఎవ్వరు నిలబడిన మటాష్




•హరీష్ అంటే వ్యక్తి కాదు వ్యవస్థ.

- •జగ్గారెడ్డి ఒక్క రోజులోనే తన మాట మార్చుకున్నాడు.
- •హరీష్ అంటే వ్యక్తి కాదు తెలంగాణ శక్తి.
- •హరీష్ అంటే తెలంగాణ ఉద్యమ మలికెక.
- •హరీష్ అంటే తెలంగాణ పోరాటానికి పాలికేక.
- •తెలంగాణ ఉద్యమ శిఖరం కేసీఆర్ కు రథ సారధి.
- •కేసీఆర్ అడుగు జాడల వారధి.
- •కేసీఆర్ వెంట తొలి జెండా పట్టుకున్న సైనికుడు.
- •కేసీఆర్ అడుగు జాడల్లో తెలంగాణ నినాదం వినిపించిన సింహ నాదం.
- •మలి దశ తెలంగాణ వాదాన్ని ఊరూరా వినిపించిన ఢమరుక నాదం.
- •అలాంటి నాయకుడి ముందు నిలబడం అంటే ఏమిటో సిద్దిపేట గడ్డి పరుకను అడిగినా చెబుతుంది.

## •జగ్గారెడ్డికి సంగారెడ్డి లోనే దిక్కు లేదు.. సిద్దిపేటకు వస్తే డిపాజిట్ కూడా రాదు!?

## •పోటీకి సిద్ధం.. గెలుసుడు కష్టం! •హరీష్ మీద గెలుసుడు అంత ఉత్త మచ్చట.. నా?

## •నిన్న హరీష్ ను ఓడిస్తా అన్నాడు.. నేడు హరీష్ మీద గెలుసుడు కష్టమే అన్నాడు?

- •సిద్దిపేట లో వీచే గాలిని కదిలించినా చెబుతుంది.
- •హరీష్ పేరు పలికే ధైర్యం ప్రత్యార్థులకు లేదు.
- •సిద్దిపేట నియోజకవర్గంలోనే అలాంటి నాయకుడు మరొకరు లేరు.
- •తెలంగాణ అంతటా అభిమానించే నాయకుడు హరీష్.
- •మాటలకు ధైర్యం చేసినా, చేతలదాక వచ్చే వారులేరు.
- •సంగారెడ్డి లోనే గెలిచే శక్తి జగ్గారెడ్డికి లేదు.
- •జగ్గారెడ్డిని దగ్గరుండి రెండు సార్లు ఓడించిందే హరీష్ రావు.
- •హరీష్ రావు ను ఓడించుడు కష్టమే అని జగ్గారెడ్డి ఒప్పుకున్నాడు.
- •ఆవేశం తో నిన్న మాట్లాడినా అని జగ్గారెడ్డి మాట మార్చేశాడు.

## కాంగ్రెస్ భవిష్యత్తు ఏమిటో ఒక్క ముక్కలో జగ్గారెడ్డి చెప్పేశాడు.

**హైదరాబాద్, నేటిధాత్రి:**

ఆశ పడితే అన్నీ దక్కవు. అత్యాశకు పోతే ఏదీ దక్కదు అని సామెత. అలాగే సిద్దిపేటలో హరీష్‌రావు మీద పోటీ చేయడం అంటే కూడా సరిగ్గా ఇలాంటిదే. తాజాగా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటన ఎంత వేగంగా చేశారో..అంతే వేగంగా తన ప్రకటనపై వివరణ ఇచ్చుకున్నారు. అదీ హరీష్ పవర్ అంటే జనం అనుకుంటున్నారు. వచ్చే రెండు సార్లు సంగారెడ్డి నుంచి తన సతీమణి పోటీ చేస్తుందని పిసిసి. వర్కింగ్ ప్రెసిడెంటు జగ్గారెడ్డి ప్రకటించారు. పనిలో పనిగా తాను వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి పోటీ చేసి హరీష్‌రావును ఓడిస్తాను. తాను గెలుస్తాను అన్నారు. ఆ మరునాడు మళ్లీ మీడియా ముందుకు వచ్చి పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తాను? కాని హరీష్ మీద గెవడం అంటే కష్టమే!!కాని ప్రయత్నం చేస్తాను!!! అన్నారు. అంటే అర్ధమేమిటో జగ్గారెడ్డికే కాదు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కూడా అర్ధమైనట్లే లెక్క. హరీష్‌రావు అనే నాయకుడు వ్యక్తి కాదు. ఒక బలమైన ప్రజా శక్తి. ఆయన వెంట జనమున్నారు. జనమే దగ్గరుండి ఏడు సార్లు గెలిపించుకున్నారు. అదీ హరీష్ అంటే. ఈ సంగతి జగ్గారెడ్డికి తెలియంది కాదు. ఉద్యమ కాలమైనా, ఇప్పుడైనా సరే హరీష్ రావు పేరు వింటే చాలు సిద్దిపేట సంబరపడుతుంది. తెలంగాణ పులకరించిపోతుంది. అలాంటి పేరు సంపాదించుకోవడం అందరి వల్ల కాదు. ఆ మధ్య సిఎం.రేవంత్ రెడ్డి సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురాలి? అంటూ పెద్ద పెద్ద లెక్కలు చెప్పారు. కాని నిజమేమిటో సిఎం. రేవంత్‌కు కూడా తెలుసు. తెలంగాణలో బిఆర్ఎస్ అనే మొక్కను మొలవనివ్వను అంటూ రేవంత్ ప్రతిజ్ఞ చేశారు. కాని సిద్దిపేట అనే నియోజకవర్గంలో 1985 నుంచి కాంగ్రెస్ అనే మొక్క కాదు కదా! గడ్డి పోచ కూడా మొలవన్వికుండా కేసిఆర్, హరీష్‌లు చూసుకుంటున్నారు. సుమారు 45 సంవత్సరాలుగా సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ కండువా అనేది ఎన్నికలప్పుడు తప్ప మళ్లీ కనిపించకుండా చేశారు. అంతెందుకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వున్న కాలంలోనైనా సరే సిద్దిపేటలో కాంగ్రెస్ జెండాలు ఎగరాలంటే కూడా ఆలోచించేవి. ఇప్పుడు కూడా అంతే..కాంగ్రెస్‌లో వున్న నాయకులు సైతం హరీష్‌రావు మీద నోరు పారేసుకోవాలన్నా ఒకటికి పది సార్లు ఆలోచిస్తారు. ఎందుకంటే ఆయన ఏనాడు పార్టీ వారిగా ప్రజలను గాని, నాయకులను గాని చిన్న చూపు చూడలేదు. రాజకీయ క్షక్షలు పెంచుకోలేదు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎవరినీ నిర్లక్ష్యం చేయలేదు. పని కోసం వచ్చిన వారు ఎవరైనా సరే తమ పార్టీ అని కాదని ఏనాడూ చూడలేదు. అందుకే సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకులు కూడా హరీష్‌రావు మీద పల్లెత్తు మాట అనడానికి కూడా ఇష్టపడరు. అందుకే హరీష్ రావు అంటే అందరికీ అంత అభిమానం. అలాంటి నాయకుడి కోటలో వేలు పెడతా? అంటే సిద్దిపేట జనమే సహించరు. సిద్దిపేట జనమే ఇతరులను ఆదరించరు. అది అన్ని పార్టీల నాయకులకు తెలుసు. ఒక కుటుంబం సిద్దిపేటలో 45 ఏళ్లుగా ఎకచ్ఛత్రాధితప్యం వహిస్తుంది అంటే అది సామాన్యమైన విషయం కాదు. సామాన్యుల్లో సామాన్యుడిలా కలిసిపోయే తత్వం హరీష్‌రావు సొంతం. అందుకే ఆయనను జనమే వదులుకోరు. ఆయన మీద ఎవరి పోటీ చేసినా కనీసం డిపాజిట్ కూడా ఇవ్వరు. గుండుగుత్తగా సిద్దిపేట ప్రజలంతా అసెంబ్లీ ఎన్నికలంటే హరీష్‌రావుకు మాత్రమే వేస్తూ వస్తున్నారు. ఏ ఎన్నికైనా సరే రాజకీయ పార్టీలు కూడా సిద్దిపేటలో ఎవరో ఒకరిని నిలబెట్టాలి. అందుకే పార్టీ తరుపున నిలబెడతారు. ఎన్నికల బరిలో వుంటారు. అయినా వారికి తెలుసు. గెలిచేది లేదని, గెలిచే పరిస్ధితి కూడా వుండదని..ఆ మధ్య బీరాలు పలికిన వారు కూడా వున్నారు. డిపాజిట్లు కూడా దక్కకుండా ఓడిపోయారు. అది సిద్దిపేట జనం తీర్పు. కేవలం హరీష్‌రావుకే సొంతం. హరీష్‌రావుది కేవలం రాజకీయమే కాదు. సామాజిక బాద్యత. అందుకే ఆయన వరుసగా గెలుస్తూ వస్తున్నారు. ప్రతి ఎన్నికలోనూ మెజార్టీ పెంచుకుంటూ వస్తున్నారు. అలా హరీష్‌రావు ఎందుకు గెలుస్తున్నారు? ఎలా గెలుస్తున్నారు? అని అనుకుంటారు. కాని ఆయన జనంలో వుండాలంటే ఎంతో ఓపిక కావాలి. ఎంతో అంకితభావం వుండాలి. జనం మీద ప్రేమ వుండాలి. ప్రజలు చల్లగా వుండాలని కోరుకునే తత్వం వుండాలి. జనం ఇబ్బందులు పడుతుంటే చూడలేని మంచి మనసుండాలి. అవన్నీ హరీష్‌రావులో వున్నాయి. ఆయన ఎప్పుడూ తన నియోజకవర్గం గురించి గొప్పలు చెప్పుకోరు. తన పని తాను చేసుకుంటూ పోతారు. అంతే తప్ప నేనేం చేశానో చూడండి అని కూడా ఏనాడు ఎవరికీ సవాలు విసురరు? ఇతర నాయకులు ఈర్ష్యపడేలా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతుంటారు. ఉమ్మడి రాష్ట్రంలో నైనా, ఇప్పుడైనా, అధికారంలో వున్నా, లేకున్నా ఆయన తత్వం మారదు. జనమంటే ప్రేమ తగ్గదు. ఉద్యమ కాలంలో తెలంగాణ కోసం ఎంత కొట్లాడారో..కరోనా కాలంలో తన ప్రజలను అలా రక్షించుకున్నారు. అది సామాన్యమైన విషయం కాదు. కరోనా కాలంలో సిద్దిపేట నియోకవర్గంలో ఎంత మంది ప్రాణాలు కాపాడారో ఆయనకే తెలియదు. అందుకోసం ఆయన పడిన తపన అంతా ఇంతా కాదు. ఎందుకంటే హరీష్‌రావు ఏనాడు తాను చేసిన సేవ చెప్పుకోరు. గొప్పలకు అసలే పోరు. ఈ రోజుల్లో ఒక్కసారి ఎమ్మెల్యే అయితే చాలు ఆ నాయకుల నడవడి మారుతుంది. వారి మాటల్లో తేడా కనిపిస్తుంది. వారి ఆహార్యం మిల మిల మెరుస్తుంది. పాత వాహనాలు పోతాయి. కొత్త కొత్త కాన్వాయిలు వస్తాయి. చూపులు పైకి చూస్తాయి. కాని హరీష్‌రావు మాటతీరుగాని, నడక తీరు గాని, నడత తీరులో ఏ మాత్రం మార్పు లేదు. సాదా సీదా ఆహార్యం ఆయన సొంతం. కార్యకర్తలతో కలిసి నిలబడి భోజనం చేస్తారు. రోడ్డపక్కన వేసే దోషలు తింటారు. మంత్రిగా వున్నా సరే ఓ టీషర్టు వేసుకంటారు. ఓ సాదా సీదా ప్యాంట్ ధరిస్తారు. వరుసగా ఇన్ని సార్లు గెలుస్తూ వస్తున్నా, ఆయనలో ఏ మార్పు రాలేదు. మంత్రిగా వున్నా కూడా సిద్దిపేటలో నడుచుకంటూ గల్లీలు తిరుగుతారు. ప్రజలతో మమేకమౌతారు. ప్రజల ఆరోగ్యం గురించి తెలుసుకుంటారు. కుటుంబ పరిస్ధితులు ఆరా తీస్తారు. సమస్యలున్నాయా? అని ప్రశ్నిస్తారు. తన పనితీరుపై కూడా స్వయంగా ఆయనే అడిగి తెలుసుకుంటారు. కాలనీలు తిరుగుతూ సామాన్యల నుంచి సమస్యలు తెలుసుకుంటారు. సహజంగా నాయకుడికి దృష్టికి సమస్యలు తీసుకెళ్తే పరిస్ధితులు ఎలా వున్నాయో చూస్తానే వున్నాం. కాని హరీష్‌రావు అందుకు భిన్నం. సమస్యలు తెలియజేస్తే వింటారు. ఆయన దృష్టికి తీసుకొస్తే స్పందిస్తారు. ఏం చేస్తే ఆ సమస్య పోతుందో కూడా ప్రజలనే సూచనలు సలహాలు కూడా అడిగి తీసుకుంటారు. అప్పుడు జనం కూడా పూర్తి స్ధాయిలో సంతృప్తి చెందుతారు. ఇలా చెప్పుకుంటూ పోతే హరీష్‌రావు గురించి కోకొల్లలు వుంటాయి. సిద్దిపేట అంటే ఒక నందన వనం.. సుందర వనం చేశారు. తెలంగాణ రాకముందే ఆయన సిద్దిపేటను ముందు నిలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత సిద్దిపేటను రోల్ మోడల్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో సీట్ల కోసం ఎదురుచూసేలా తీర్ది దిద్దారు. కార్పోరేట్ ప్రైవేటు పాఠశాలను మించి సౌకర్యాలు కల్పించారు. సిద్దిపేట నిరుద్యోగుల కోసం కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. కోచింగ్ కోసం వచ్చే నిరుద్యోగులకు నిత్యం భోజన వసతి కూడా కల్పిస్తున్నారు. అది ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసింది కాదు. తెలంగాణ రాకముందే అలాంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. హరీష్‌రావును ఆదర్శంగా తీసుకొని గత బిఆర్ఎస్ హాయాంలో అందరు ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా సొంత ఖర్చులతో నిరుద్యోగులకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వారికి వసతులు కూడా ఏర్పాటు చేశారు. అలాంటి ఆదర్శవంతమైన నాయకుడు హరీష్‌రావు. అలాంటి హరీష్‌రావు మీద ఎన్నికల్లో పోటీచేయాలంటే సామాన్యమైన విషయం కాదు. అందుకే సిద్దిపేటలో ప్రజలు ఒక విషయాన్ని సూటిగా స్పష్టంగా చెబుతుంటారు. హరీష్‌రావు మీద పోటీ చేడడం అంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసినట్లే! చెప్పుకుంటారు. అదీ హరీష్‌రావు పవర్. దటీజ్ హరీష్‌రావు...నో.. నెవ్వర్ ఎనీ వన్ బికమ్ లైక్ ఏ లీదర్ హరీష్!!

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి



నిష్పక్షపాత కర్తవ్య నిర్వహణం

22ND ANNIVERSARY

నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

బుధవారం 15-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 100 రూ॥ 6.00


# ప్రజాస్వామ్యానికి వెన్నుముకగా ..బీఎల్ఓలు

## బీఎల్ఓలకు గుదిబండగా మారిన "సర్" ప్రక్రియ









"ప్రజాస్వామ్యాన్ని భుజాన మోస్తున్న మహిళ బీఎల్ఓలు!"

ప్రతి ఓటు వెనుక... ఓ బీఎల్ఓ త్యాగం!"..ఎండనక... వాననక... సేవే ధ్యేయం!!

- కష్టసాధ్యంగా మారిన ఓటర్ల ఇంటింటి గుర్తింపు
- తాళాలు వేసిన ఇళ్లతో మరో తలనొప్పి
- పదికేజీల బరువైన ఎన్యూమరేషన్ ఫారాలతో తిరగాల్సి రావడం
- తలనొప్పిగా మారిన 2002నాటి ఓటర్లతో పోల్చడం
- మారిన అసెంబ్లీ నియోజకవర్గాల పరిధితో మరింత గందరగోళం
- ఆన్‌లైన్ ప్రక్రియ మరింత సంక్లిష్టం
- ఫారాలు నింపడంలో గందరగోళం
- ఫారాలు తిరిగి ఇవ్వడానికి వెనుకాడుతున్న ఓటర్లు
- పులిమీద పుట్రలా ఇందిరమ్మ చీరెల పంపిణీ బాధ్యతలు
- దీంతో వేగం మందగించిన సర్ ప్రక్రియ


తాళాలు వేసిన ఇల్లు


భారీ ఫరాలు, రికార్డులు


మొబైల్ యాప్ లో లోపాలు


ఫరాలు నింపడంలో గంధరగోళం


ఇంటింటి సర్వేతో శ్రమ


ఇందిరమ్మ చీరల పంపిణీ తో రెట్టింపు పనిభారం

**హైదరాబాద్, నేటిధాత్రి:**
తెలంగాణలో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల ప్రక్షాళన (సర్) ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ ఓలు) క్షేత్రస్థాయిలో తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకువలస వెళ్లడం, అద్దె ఇళ్లు మారడం వల్ల అనేక ఇళ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. దీనివల్ల ఓటర్ల ఇంటింటి గుర్తింపు కష్టంగా మారింది. క్షేత్రస్థాయి పరిశీలన కోసం బీఎల్ఓలు దాదాపు 10 కేజీల బరువైన ఎన్యుమరేషన్ ఫారాలను, రికార్డులను పట్టుకుని ప్రతి ఇల్లూ తిరగాల్సి వస్తోంది. 2002 నాటి పాత ఓటర్ల జాబితా డేటాతో ప్రస్తుత ఓటర్ల వివరాలను సరిపోల్చడం, మారుతు న్న అసెంబ్లీ నియోజకవర్గాల పరిధుల వల్ల తీవ్ర గందరగోళం ఏర్పడుతోంది. వేర్వేరు ప్రభుత్వ శాఖల నుండి వచ్చిన బీఎల్ఓలకు కేటాయించిన డివిజన్లు లేదా ఏరియాలపై అవగాహన ఉండటం లేదు. మొబైల్ యాప్‌లో ఇచ్చిన మ్యాప్‌లు అస్పష్టంగా ఉండటంతో ఇళ్లను గుర్తించలేకపో తున్నారు. పాత పీడీఎఫ్ జాబితాల్లో ఉన్న పేర్లు, వివరాలు అధికారిక సెర్చ్ పోర్టల్లో సరిగ్గా కనిపించకపోవడంతో డేటా వెరిఫికేషన్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల వివరాల శోధన కేవలం తెలుగులోనే అందుబాటులో ఉండటం, చాలా డివైజ్లలో తెలుగు టైపింగ్‌సదుపాయం లేకపోవడంతో ఆన్లైన్ ప్రక్రియ క్లిష్టంగా మారింది. చాలా మంది ఓటర్లకు ఫారాలుఎలా నింపాలో తెలియకపోవడం, తప్పుడు వివరాలు ఇస్తే ఓటు హక్కు పోతుందనే భయంతో ఫారాలు తిరిగి ఇవ్వడానికి వెనుకాడుతున్నారు. ఓటర్ల నుండి పూర్తి చేసిన దరఖాస్తులు సకాలంలో అందకపోవడం వల్ల సేకరించిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా డిజిటలైజ్ చేయడం బీఎల్ఓలకు పెద్ద తలనొప్పిగా మారింది.

### ఇందిరమ్మ చీరెల పంపిణీ బాధ్యతలు

తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక ప్రక్షాళన (సర్) వంటి అత్యంత క్లిష్టమైన బాధ్యతలతో ఇప్పటికే తీవ్రమైన పని ఒత్తిడి ఎదుర్కొంటున్న బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ ఓలు), ప్రభుత్వం అదనం గా ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ బాధ్యతలను కూడా అప్పగించడం అవగాహనా రా హిత్య చర్య అని క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. అయితే ప్రభుత్వ అభిప్రా యం మరోలా వుంది. ప్రభుత్వ విభాగాలన్నింటిలోనూ బీఎల్ఓలకు స్థానిక పరిధులు, వార్డులు మరియు ప్రతి ఒక్క ఇంటిపై పూర్తి అవగాహన మరియు పట్టు ఉంటుంది. ఓటర్ల సర్వే (సర్) కోసం బీఎల్ఓలు ఇప్పటికే ప్రతి ఇంటినీ సందర్శిస్తూ, కుటుంబాల సమాచారాన్ని సేకరిస్తున్నారు. అదే సమయంలో అర్హులైన మహిళలను గుర్తించడం సులువవుతుందని ప్రభుత్వం భావించింది. చీరల పంపిణీలో ఎలాంటి దుర్వినియోగం జరగకుండా, కేవలం అర్హులైన పేద మహిళలకే అవి అందేలా చూసేందుకు బాధ్యతా యుతమైన ప్రభుత్వ ఉద్యోగులైన బీఎల్ఓల సేవలనే నమ్ము కుంది. అంతేకాదు చీరల పంపిణీకి ఆధార్ మరియు ఫేషియల్ అథెంటికేషన్ తప్పనిసరి చేశారు. ఈ డిజిటల్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించే సాంకేతిక అవగాహన బీఎల్ఓలకు ఉండ టం మరో కారణం.దాదాపు కోటి మంది మహిళలకు రెండు విడతలుగా (గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో) నిర్ణీత గడువులోగా పంపిణీ పూర్తి చేయాలనే లక్ష్యంతో, విస్తఅతమైన యంత్రాంగం ఉన్న బీఎల్ఓలను రంగంలోకి దించారు. ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డేటా ఎంట్రీల లోపాలు, గడువు ముగుస్తుండటం వల్ల ఒత్తిడిలో ఉన్న బీఎల్ఓలకు, ఈ చీరల పంపిణీబాధ్యత కూడా తోడవడంతో వారిపై పనిభారం రెట్టింపైంది. దీనివల్ల సర్వే ప్రక్రియ కొంత ఆలస్యమవడమే కాకుండా, క్షేత్రస్థాయిలో వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిజంగా ఇది మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది.

### తెలంగాణ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం

తెలంగాణ ప్రభుత్వం ఓటర్ల ప్రత్యేక ప్రక్షాళన (సర్)సర్వే వల్ల బీఎల్ఓలపై ఉన్న తీవ్రమైన పని ఒత్తిడిని పూర్తిగా పరిగణనలోకి తీసుకోకుండా, ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ బాధ్యతలను కూడా వారికి అప్పగించడం వెనుక కొన్ని బలమైన రాజకీయ,పరిపాలనా పరమైన కారణాలున్నాయి. ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ అనేది ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంక్షేమ పథకం. దీనిని ఉగాది లేదా దసరా వంటి పండుగల లోపే లక్షలాది మంది లబ్ధిదారులకు చేర్చాలనే రాజకీయ గడువు ఒత్తిడి ప్రభుత్వంపై ఉంది. బీఎల్ ఓలపై అదనపు భారం మోపడానికి ఇదే ప్రధాన కారణం. సర్ సర్వే కోసం బీఎల్ఓలు ఇప్పటికే ప్రతి ఇంటి త లుపు తడుడుతూ నివాసితుల పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. విడిగా మరో యంత్రాంగాన్ని పెడితే సమయం, ఖర్చు వఅథా అవుతాయని, ఈ సర్వేతో పాటే చీరల పంపిణీని కూడా ముడ ిపెట్టవచ్చని ప్రభుత్వం భావించింది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇల్లూ తెలిసిన ఏకైక ప్రభుత్వ యంత్రాంగం బీఎల్ఓలు లేదా స్థానిక రెవెన్యూ/పంచాయతీ సిబ్బంది మాత్రమే. రేషన్ డీలర్లు లేదా ఐసీడీఎస్ సిబ్బందితో పోలిస్తే బీఎల్ఓల ద్వారా పంపిణీ చేస్తే పారదర్శకత ఎక్కువగా ఉ ంటుందని ప్రభుత్వం నమ్మింది. చీరల పంపిణీలో అక్రమాలను అరికట్టడానికి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ యాప్లను ఉపయోగించాల్సి ఉంది. సర్ సర్వే కోసం ఇప్పటికే మొబైల్ యాప్‌లను వాడుతున్న బీఎల్ఓలకు ఈ సాంకేతికతపై పట్టు ఉంటుందని ప్రభుత్వం ఈ బాధ్యతను వారిపై వేసింది. ప్రభుత్వ ఉన్నతాధికారుల దఅష్టిలో, వేర్వేరు పథకాలకు వేర్వేరు కమిటీలను వేయడం కంటే, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చురుగ్గా ఉన్న గ్రూప్‌ను వాడుకోవడం పరిపాలనాపరంగా సులువైన మార్గంగా కనిపించింది. ప్రభుత్వం కేవలం పరిపాలనా సౌలభ్యాన్ని మాత్రమేచూసి ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు ఇప్పటికే 10 కేజీల బరువైన ఎన్యుమరేషన్ రికార్డులు మోస్తూ, మొబైల్ యాప్ లోపాలతో సతమతమవుతున్నారు. దీనికి తో డు చీరల పంపిణీ, లబ్దిదారుల వెరిఫికేషన్ కూడా తోడవడంతో తమకు ఊపిరి సలపడం లేదని,మానసిక ఒత్తిడికి గురవుతున్నామని బీఎల్ఓ సంఘాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి.

### బీఎల్ ఓ సంఘాల డిమాండ్లు

ఓటర్ల ప్రక్షాళన వంటి చట్టబద్ధమైన ఎన్నికల విధుల్లో ఉన్నందున, సంక్షేమ పథకాల (చీరల) పంపిణీ బాధ్యతల నుండి తమను పూర్తిగా తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మొబైల్ యాప్‌లో వస్తున్న సాంకేతిక లోపాలు, సర్వే ఫారాల డిజిటలైజేషన్ ఆలస్యం దఅష్ట్యా ఎస్ఐఆర్ సర్వే పూర్తి చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని కోరుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, వలస వెళ్లిన ఓటర్ల గుర్తింపు కోసం స్థానిక విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు (వీఆర్ ఏలు) లేదా మున్సిపల్ సి బ్బందిని తమకు సహాయకులుగా కేటాయించాలని అడుగుతున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసిన తర్వాత, ఆ వివరాలన్నింటినీ పోర్టల్లో నమోదు చేసేందుకు ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆప రేటర్లను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. మొబైల్ యాప్‌లో అస్పష్టంగా ఉన్న ఏరియా మ్యాప్లను సరిచేయాలని, ఆఫ్లైన్ మోడ్లో కూడా డేటా సేవ్ అయ్యేలా యాప్‌ను అప్‌డేట్ చేయాలని కోరుతున్నారు.

### సర్దుబాటు చర్యలు

బీఎల్ఓలపై ఒత్తిడి తగ్గించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు (ఐసీడీఎస్), ఆశా వర్కర్లు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శులను చీరల పంపిణీ మరియు లబ్దిదారుల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగస్వామ్యం చేశారు. మొబైల్ యాప్ మరియు పోర్టల్ సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రతి నియోజకవర్గ/మండల కేంద్రంలో ప్రత్యేక సాంకేతిక బఅందాలతో హెల్ప్ డెస్క్‌లను అందుబాటులోకి తెచ్చారు.పట్టణ ప్రాంతాల్లో భారీగా ఉన్న అపార్ట్‌మెంట్లు, తాళం వేసిన ఇళ్లను గుర్తించడానికి స్థానిక బిల్ కలెక్టర్లు లేదా మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లను బీఎల్ఓలకు సహాయంగా అటాచ్ చేశారు. ఒకేసారి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఒక విడత, పట్టణ ప్రాంతాల్లో మరో విడతగా చీరల పంపిణీ జరిగేలా ప్రణాళిక మార్చి ఒత్తిడిని కొంతవరకు తగ్గించే ప్రయత్నం చేశారు.

### మొబైల్ యాప్‌లో సాంకేతిక లోపాలు

క్షేత్రస్థాయిలో ఇళ్లను ట్యాగ్ చేసేటప్పుడు జిపిఎస్ లకేషన్ సరిగ్గా నమోదు కాకపోవడం, తప్పు డు లకేషన్లు చూపించడం వల్ల డేటా తప్పుగా రికార్డ్ అవుతోంది. ఒకేసారి వేలాది మంది బీఎల్ఓలు యాప్ ఉపయోగించడం వల్ల సర్వర్ తరచూ క్రాష్ అవుతోంది. ఒక్కో ఓటరు వివరాలు లోడ్ అవ్వడానికి చాలా సమయం పడుతోంది. గ్రామీణ మరియు ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సిగ్నల్ లేనప్పుడు యాప్ పూర్తిగా పనిచేయడం లేదు. ఆఫ్‌లైన్‌లో డేటా సేవ్ చేసుకునే ఆప్షన్ లేకపోవడం పెద్ద మైనస్ పాయింట్.కొత్త ఓటర్ల దరఖాస్తులకు సంబంధించిన ఫోటోలు, ఆధార్ కార్డులను అప్లోడ్ చేసేటప్పుడు అప్‌లోడ్ ఫెయిల్డ్ లేదా ఎర్రర్ 500 అని రావడం వల్ల ప్రక్రియ మొదటి నుండి చేయాల్సి వస్తోంది. తెలుగులో ఓటర్ల వివరాలను వెతికేటప్పుడు ఫాంట్ సరిగ్గా సపోర్ట్ చేయకపోవడం, పేర్లు అక్షరదోషాలతో కనిపించడం వల్ల వెరిఫికేషన్ క్లిష్టంగా మారింది.

### ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలు

సాంకేతిక లోపాల వల్ల క్షేత్రస్థాయి పరిశీలన ఆలస్యమవుతున్నందున, ఓటర్ల జాబితా సవరణ గడువును పొడిగిస్తూ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. యాప్‌లోని బగ్ లను తొల గించడానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లను విడుదల చేసింది. ప్రతి జిల్లా కేంద్రంలో సమస్యలను పరిష్కరించడానికి 24/7 ఐటి సపోర్ట్ టీములను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. యాప్ పూర్తిగా సమ్మతించని అత్యవసర పరిస్థితుల్లో, బీఎల్ఓలు భౌతిక ఫారాలపై సంతకాలు/బొటనవేలి ముద్రలు సేకరించి, ఆ తర్వాత వాటిని కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా పోర్టల్లో అప్‌లోడ్ చేయవచ్చని అనుమతించింది. ఓటర్ల ప్రక్షాళన అనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన విధి కాబట్టి, ఈ ప్ర క్రియ ముగిసే వరకు బీఎల్ఓలను ఇతర ప్రభుత్వ విధులకు (సంక్షేమ పథకాల పంపిణీ వంటివి) ఎక్కువగా ఉపయోగించకూడదని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్న సందర్భాల్లో, నోటీసులు ఇవ్వకుండా ఓటు తొలగించరాదని, రెండు చోట్లా క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి అని కఠిన ఆదేశాలు జారీ చేసింది.

### చట్టపరమైన గడువులు వర్సెస్ క్షేత్రస్థాయి వాస్తవాలు

ఎన్నికల సంఘం ఆర్టికల్ 324 మరియు ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనల ప్రకారం ఖచ్చిత మైన టైమ్‌లైన్‌ను అనుసరించాల్సి ఉంటుంది. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చట్టబద్ధమైన తేదీలు ముందే ఖరారవుతాయి. ప్రక్రియకు కేవలం నిర్ణీత రోజుల సమయం మాత్రమే ఉంటుంది. ఈ గడువును పొడిగిస్తే, ఆ తర్వాత వచ్చే అభ్యంతరాల స్వీకరణ, ఓట్ల తొలగింపు నోటీసులు మరియు తుది జాబితా రూపకల్పన వంటి తదుపరి ప్రక్రియలన్నీ ఆలస్యమవుతాయని ఈసీ భావిస్తుంది. ఎన్నికల సంఘం ఉన్నత స్థాయి అధికారులకు ఇచ్చే శిక్షణ, మండల మరియు మున్సిపల్ స్థాయికి వచ్చేసరికి పూర్తిగా క్షేత్రస్థాయి సిబ్బందికి అర్థమయ్యేలా చేరడం లేదు. దొంగ ఓట్లను అరికట్టడానికి ఫారాలలో నిరంతరం కొత్త నిబంధనలు (ఉదాహరణ కు తల్లిదండ్రుల ఓటరు ఐడి సీరియల్ నంబర్ లింక్ చేయడం వంటివి) చేరుస్తున్నారు. ఈ మార్పులపై ముందస్తు సమాచారం లేదా శిక్షణ ఇవ్వకుండానే నేరుగా అప్లికేషన్లలో అప్‌డేట్ చేస్తుండటంతో బీఎల్ఓలు అయోమయానికి గురవుతున్నారు. ఒత్తిడి తగ్గించడానికి మున్సిపల్ లేదా పంచాయతీ కార్మికులను సహాయకులుగా పంపుతున్నప్పటికీ, వారికి ఓటరు ఫారాలు ఎలా నింపాలో తెలియకపోవడం వల్ల కేవలం ఫారాలు మోయడానికే వారు పరిమితమవుతున్నారు. ఉన్నతాధికారులు ఇళ్ల నంబర్లు ఒకే క్రమపద్ధతిలో ఉంటాయని భావించి సమయాన్ని కేటాయిస్తారు. కానీ హైదరాబాద్ వంటి నగరాల్లో అపార్ట్మెంట్లు, కొత్తగా మారిన డోర్ నంబర్ల వల్ల ఒక ఇంటినిగుర్తించడానికే బీఎల్ఓలకు గంటల సమయం పడుతోంది. ఒక ఇల్లు తాళం వేసి ఉంటే బీఎల్ఓమళ్లీ మళ్లీ వెళ్లాల్సి వస్తోంది. కానీ పై అధికారులు కేవలం ఎన్ని ఫారాలు సబ్మిట్ చేశారనే సంఖ్యను మాత్రమే చూస్తూ ఒత్తిడి తెస్తున్నారు.

### ఎన్నికల సంఘం ప్రత్యామ్నాయ చర్యలు

బీఎల్ఓలపైనే పూర్తిగా భారం పడకుండా, ఓటర్లు నేరుగా ఈసీఐ ఓటర్ సర్వీసెస్ పోర్టల్ లేదా 1950 టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. మొబైల్ యాప్‌లు సరిగ్గా పనిచేయనప్పుడు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులపై సంతకాలు లేదా బొటనవేలి ముద్రలు తీసుకుని, ఆ తర్వాత వాటిని డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా సిస్టమ్‌లో అప్‌లోడ్ చేయడానికిఅనుమతి ఇచ్చారు.

### తక్కువ సమయంలో ఎక్కువ ఇళ్ల సర్వే సాధ్యం ఎలా?

ఒక బీఎల్ఓ ఉదయం నుండి సాయంత్రం వరకు 8 గంటల పాటు (480 నిమిషాలు) విరామంలేకుండా పనిచేశారని అనుకుందాం. ఒక ఇంటికి వెళ్లినప్పుడు తాళం తీయడానికి పట్టే సమ యం, ఓటరును పలకరించి వివరాలు అడగడం, 10 కేజీల బరువైన రికార్డులలో వారి పేర్లు వెతకడం, ఫారాలు నింపడం లేదా మొబైల్ యాప్లో వివరాలు మరియు జిపిఎస్ (జీపీఎస్) లకేషన్ నమోదు చేయడానికి కనీసం 15 నుండి 20 నిమిషాలు పడుతుంది. దీని ప్రకారం రోజుకు గరిష్టంగా 25 నుండి 30 ఇళ్లు మాత్రమే సర్వే చేయగలరు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు దూరదూరంగా ఉండటం, పట్టణ ప్రాంతాల్లో అపార్ట్మెంట్ సెక్యూరిటీ అనుమతులు, గజిబిజిగా ఉండే డోర్ నంబర్ల వల్ల ఒక ఇంటి నుండి మరో ఇంటికి వెళ్లడానికే చాలా సమయం వఅథా అవుతుంది. చాలా ఇళ్లకు తాళాలు వేసి ఉండటం వల్ల, ఆ సమాచారం కోసం పొరుగువారిని విచారించాల్సి రావడం బీఎల్ఓల సమయాన్ని మరింత హరిస్తుంది.

### ఉన్నతాధికార్లకు పట్టని క్షేత్రస్థాయి సమస్యలు

ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ఢిల్లీ లేదా హైదరాబాద్‌లోని ఏసీ ఆఫీసుల్లో కూర్చుని కేవ లం కంప్యూటర్ డేటా, గణాంకాల ఆధారంగా ప్రణాళికలు రచిస్తారు. వారు క్షేత్రస్థాయిలో ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి ఎదుర్కొనే ఎండ, వాన, ట్రాఫిక్, ప్రజల అసహకారం వంటి ప్రాక్టికల్ ఇబ్బందులను అంచనా వేయలేకపోతున్నారు. ఉన్నతాధికారులకు కేవలం నిర్ణీత గడువులోగా 100% సర్వే పూర్తి కావాలనే టార్గెట్లు మాత్రమే ముఖ్యం. కింద స్థాయి అధికారుల నుండి వచ్చేనివేదికలు కూడా "సర్వే వేగంగా సాగుతోంది" అని పాజిటివ్‌గా వెళ్లేలా ఒత్తిడి తెస్తుండటంతో, అసలు సమస్యలు పైవరకు చేరడం లేదు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం జనవరి నాటికి తుది ఓటర్ల జాబితా సిద్ధం కావాలి. ఈ గడువును మార్చడం ఎన్నికల సంఘానికి కూడా చట్టపరంగాసాధ్యం కాదు. అందువల్ల ఆ ఒత్తిడిని మొత్తం కింద ఉన్న బీఎల్ఓలపైకి నెట్టేస్తున్నారు. బీఎల్ఓలందరూ ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, రెవెన్యూ సిబ్బంది వంటి ఇతర ప్రభుత్వ ఉద్యోగ విధులు నిర్వహించేవారే. కానీ ఎన్నికల సంఘం వీరికి రోజువారీ ఉద్యోగ బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని పక్కనబెట్టి, కేవలం ఎన్నికల సిబ్బందిగానే పరిగణించి అసాధ్యమైన టార్గెట్లను విధిస్తోంది. జూన్ 25 నుండి ప్రారంభమైన ఈ సర్వేను జూలై 24 లోగా పూర్తి చేయాలని కఠినమైన టార్గెట్ విధించారు. సర్వే ఆధారంగా సవరించిన ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31 లోగా విడుదల చేయాలి. ఆగస్టు 1 నుండి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుండి కొత్త దరఖాస్తులు, తప్పుల సవరణలను స్వీకరిస్తారు.అన్ని సవరణలు పూర్తి చేసి అక్టోబర్ 1 నాటికి తుది జాబితాను అధికారికంగా ప్రచురించాల్సి ఉంటుంది.

### ఉద్యోగ సంఘాల నిరసనలు

బీఎల్ఓలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు, రెవెన్యూ మరియు మున్సిపల్ సిబ్బంది సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నాయి. ఎన్నికల విధులతో పాటు ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ బాధ్యతలను కూడా బలవంతంగా రుద్దడాన్ని నిరసిస్తూ బీఎల్ఓ సం ఘాలు కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టాయి. మొబైల్ యాప్లలో సాంకేతిక లోపాలను సవరించకుండా, కేవలం ఆన్‌లైన్ ఎంట్రీలు కాలేదని ఉన్నతాధికారులు మెమోలు జారీ చేయడాన్ని సంఘాలు తీవ్రంగా ఖండించాయి. యాప్‌లను బహిష్కరించి కేవలం భౌతిక ఫారాలనే సబ్మిట్ చే స్తామని హెచ్చరించాయి.తమ స్వంత డిపార్ట్మెంట్ పనులు (బడి పిల్లలకు పాఠాలు చెప్పడం లేదా రెవెన్యూ విధులు) చేసుకుంటూ, సెలవు రోజుల్లో కూడా ఇన్నేసి ఇళ్లు తిరగాలనడం మానవ హక్కుల ఉల్లంఘనే అని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### గతంలో కోర్టు ఆదేశాలు

గతంలోనూ, ప్రస్తుత సర్వేల సందర్భంలోనూ ఇలాంటి వివాదాలు కోర్టుల వరకు వెళ్లాయి. సు ప్రీంకోర్టు మరియు హైకోర్టుల గత తీర్పుల ప్రకారం, ప్రభుత్వ ఉపాధ్యాయులను కేవలం ఎన్నికలరోజు విధులు, ఓటర్ల నమోదు, జనాభా లెక్కలు,విపత్తుల నిర్వహణకు మాత్రమే ఉపయోగిం చాలి. సంక్షేమ పథకాల పంపిణీ (చీరల పంపిణీ వంటివి) కి వారిని వాడటం చట్టవిరుద్ధమని ఉద్యోగ సంఘాలు కోర్టు తీర్పులను ఉటంకిస్తున్నాయి. టార్గెట్లు రీచ్ కాలేదని బీఎల్ఓలపై సస్పెన్షన్లు లేదా వేతనాల నిలిపివేత వంటి కఠిన చర్యలు తీసుకున్నప్పుడు, ఉద్యోగ సంఘాలు కోర్టులనుఆశ్రయించి స్టే ఆర్డర్లు తెచ్చుకుంటున్నాయి. ప్రాక్టికల్ సమస్యలను విస్మరించి సిబ్బందిని వేధించకూడదని కోర్టులు స్థానిక అధికారులను గతంలో హెచ్చరించాయి. ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి చూస్తే, ఈ నెల జూలై 24, 2026 లోగా ఎస్ఐఆర్ ప్రక్రియను 100% విజయవం తంగా పూర్తి చేయడం చాలా కష్టమని రాజకీయ విశ్లేషకులు మరియు ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి అందించిన తాజా అధికారిక సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 99% ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయినప్పటికీ, కేవలం 28% ఫారాలు మాత్రమే ఓటర్ల నుండి తిరిగి సేకరించబడ్డాయి. మిగిలిన 71% కంటే ఎక్కువ ఫారాలను కేవలం కొన్ని రోజుల్లోనే సేకరించి, డిజిటలైజ్ చేయడం ఒక పెద్ద స వాలుగా మారింది. బీఎల్ఓలు ఇళ్లకు వెళ్లి ఫారాలు ఇచ్చినప్పటికీ, ప్రజలు వాటిని వెంటనే పూ రించి తిరిగి ఇవ్వడం లేదు. ఇప్పటివరకు కేవలం 28% దరఖాస్తులు మాత్రమే అధికారులకు అందాయి. తెలంగాణలో దాదాపు 20 లక్షల డూప్లికేట్ (ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్న) ఓట్లు ఉన్నాయని రాజకీయ పార్టీలు గుర్తించాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి, నోటీసులు ఇచ్చి తొలగించడానికి ప్రస్తుత సమయం ఏమాత్రం సరిపోదు.ముఖ్యంగా హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లో అపార్ట్‌మెం ట్లలోకి అనుమతులు దొరక్కపోవడం, అద్దెదారులు ఇళ్లు మారిపోవడం వల్ల వందలాది ఇళ్ల వెరిఫికేషన్ ఇంకా పెండింగ్‌లోనే వుంది. ఇప్పటికే తీవ్రమైన పని ఒత్తిడిలో ఉన్న బీఎల్ఓలకు ఇందిరమ్మ చీరల పంపిణీ బాధ్యతలు కూడా అప్పగించ దంతో సర్వే వేగం బాగా మందగించింది.

### గడువు పొడిగింపుకోసం ఒత్తిడి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు ఇతర నేతలు కేంద్ర ఎన్నికల సంఘం అధికార్లను కలిసి, క్షేత్రస్థాయి ఇబ్బందులను వివరించారు. కేవలం 7% నుండి 28% లోపే పని పూర్త యినందున ఎస్ఐఆర్ గడువును కనీసం ఒక నెల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. మొబైల్ యాప్ టెక్నికల్ లోపాలు మరియు సర్వర్ డౌన్ సమస్యల వల్ల తాము అనుకున్న సమయానికి టార్గెట్లు రీచ్ కాలేకపోతున్నామని, గడువు పొడిగించకపోతే ఓటర్ల జాబితాలో భారీగా తప్పులు దొర్లే ప్రమాదం ఉందని బీఎల్ఓలు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారంజూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ విడుదల చేయాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో పెండింగ్ ఉన్నభారీ వర్క్‌లోడ్ దఅష్ట్యా, ఇసి హౌస్-టు-హౌస్ సర్వే గడువును (జూలై 24 తర్వాత కూడా) మరికొన్ని రోజులు పొడిగించే అవకాశం లేదా ఆన్‌లైన్ సెల్ఫ్-ఎన్యుమరేషన్‌కు మరింత ప్రాధాన్యత ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

### ఫార్మాట్‌లో గందరగోళం

ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియ రూపకల్పన మరియు ఫార్మాట్ అత్యంత గందరగోళంగా ఉందనేది అక్షరాలా వాస్తవం.ఈ లోపాల వల్ల అర్హులైన నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంది. దీనిపై ప్రజల్లో, ఉద్యోగ సంఘాల్లో మరియు రాజకీయ పార్టీల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మునుపటి ఓటర్ల జాబితా సవరణలలో బీఎల్ఓలు ఇళ్లకు వచ్చి వివరాలు అడిగి వారే రాసుకునేవారు. కానీ ప్రస్తుత సర్ ఫార్మాట్లో బీఎల్ఓలు కేవలం ఫారాలు ఇచ్చి వెళ్తున్నారు. ఆ క్లిష్టమైన ఫారాలను ఓటర్లే స్వయంగా నింపి, పాత ఓటర్ ఐడీ నంబర్లు, సీరియల్ నంబర్లు వెతికి రాయాల్సి రావడం సామాన్య ప్రజలకు పెద్ద తలనొప్పిగా మారింది. బీఎల్ఓలు 2002 నాటి పాత రికార్డులను పట్టుకుని తిరగాల్సి వస్తోంది. ప్రస్తుత డిజిటల్ కా లంలో 24 ఏళ్ల నాటి పాత పేపరు రికార్డులతో వివరాలను సరిపోల్చమనడం పరిపాలనాపరంగా ఒక పెద్ద తప్పు. మొబైల్ యాప్‌లో ఇంటి లకేషన్ ట్యాగ్ చేసేటప్పుడు జిపిఎస్ (జీపీఎస్) లోపాల వల్ల తప్పుడు ఏరియా నమోదవుతోంది. దీనివల్ల ఒక పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్లు మరో బూత్‌కు మారిపోయే గందరగోళం ఏర్పడుతోంది. ఉపాధి కోసమో లేదా ఇతర పనుల కోసమో ప్రజలు పగటిపూట బయటకు వెళ్లినప్పుడు ఇళ్లకు తాళాలు ఉంటున్నాయి. బీఎల్ఓలు రెండు మూడు సార్లు వచ్చి తాళం చూసి, వారు అక్కడ నివసించడం లేదని రిపోర్ట్ రాస్తే, నిజమైన ఓటరు ఓటు కూడా జాబితా నుండి తొలగించబడుతుంది. తెలంగాణ వ్యాప్తంగా 99% ఫారాలు పంపిణీ చేసినా, కేవలం 28% మంది మాత్రమే తిరిగి ఇచ్చారు. మిగిలిన వారు భయం తోనో, అవగాహన లేకనో ఫారాలు ఇవ్వకపోతే.. వారి ఓట్లను "అనుమానాస్పద ఓట్లు"గా పరిగణించి తొలగించే ప్రమాదం ఉంది. నగరాల్లో తరచూ ఇళ్లు మారే అద్దెదారుల వివరాల వెరిఫికేషన్ ఈ ఫార్మాట్‌లో చాలా లోపాలతో కూడి ఉంది. పాత ఇంటి అడ్రస్ లో వారు లేరని ఓటు తీసేస్తే, కొత్త ఇంటి దగ్గర వెంటనే ఓటు నమోదు కావడం లేదు. ఒక ఓటును తొలగించే ముందునోటీసు ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ, ప్రస్తుత గడువు ఒత్తిడి (జూలై 24 లోగా పూర్తి చేయాలి) వల్ల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించకుండానే డూప్లికేట్ పేరుతో నిజమైన ఓట్లను కూడా డిలీట్ చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియలోని గందరగోళాన్ని గమనించిన రాజకీయ పార్టీలు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేశాయి. ఫారాలు సబ్మిట్ చేయని లబ్ధిదారుల ఓట్ల ను నేరుగా తొలగించకుండా, కేవలం భౌతిక ధఅవీకరణ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నాయి.



నిర్భయంగా నిష్పక్షపాతంగా

22ND ANNIVERSARY

నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక



బుధవారం 15-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 100 రూ॥ 6.00




# తెలంగాణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్!

## వరంగల్‌కు అంతర్జాతీయ విమానాశ్రయం.. ఆర్ఆర్ఆర్‌కు వేగం



నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్.. ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారి ప్రాజెక్టులపై విజ్ఞప్తి.



రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్.. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలపై కీలక చర్చ.


- వరంగల్, ఆదిలాబాద్‌కు అంతర్జాతీయ ప్రమాణాల విమానాశ్రయాలు
- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం ప్రారంభ లక్ష్యం
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టే టెర్మినల్ డిజైన్
- ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు త్వరలో ప్రారంభించాలని విజ్ఞప్తి
- ఫ్యూచర్ సిటీ–బందరు పోర్ట్ 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ప్రతిపాదన
- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ మార్గం నిర్మాణంపై కేంద్రంతో చర్చలు
- మన్ననూరు–శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతుల కోరింపు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
తెలంగాణ అభివృద్ధికి కీలకమైన విమానాశ్రయాలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు వేగం తీసుకురావడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన సీఎం, వరంగల్--ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), ఫ్యూచర్ సిటీ–బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ మార్గం తదితర ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కోరారు.
వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. వరంగల్ విమానాశ్రయానికి భూసేకరణ పూర్తయిందని, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి 2028 జూన్ 2 నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విమానాశ్రయంలో ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్, విమాన శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కాకతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా టెర్మినల్ రూపకల్పన ఉండాలని సూచించారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికీ ఇదే తరహా ఆధునిక సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదించారు.
అదే సమయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో జరిగిన సమావేశంలో ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిందని, వెంటనే కేంద్ర మంత్రివర్గ ఆమోదం ఇచ్చి పనులు ప్రారంభించాలని సీఎం కోరారు. ఉత్తర, దక్షిణ భాగాల పనులు ఏకకాలంలో చేపడితే నిర్మాణం వేగంగా పూర్తవుతుందని తెలిపారు.
ఫ్యూచర్ సిటీ–అమరావతి–బందరు పోర్ట్ మధ్య 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి అనుమతులు ఇవ్వాలని, హైదరాబాద్–మంచిర్యాల మధ్య రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఆరు వరుసల కొత్త జాతీయ రహదారిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మన్ననూరు–శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అవసరమైన అటవీ అనుమతులు కూడా త్వరగా మంజూరు చేయాలని కోరారు.
సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ “అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో సమన్వయంగా పనిచేస్తున్నాం” అని అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణను అత్యంత వేగంగా పూర్తి చేయడాన్ని ప్రశంసిస్తూ, వరంగల్ విమానాశ్రయం కాకతీయ వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్మిస్తామని తెలిపారు.

# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

## క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం

- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు
- అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు
- 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు
- ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు






ఆర్టీజీఎస్‌లో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

అమరావతి, నేటిధాత్రి:
ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్

12లో



# ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక

## మెట్ట పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, నేటిధాత్రి :
ఈ రోజు నిర్వహించిన ‘రైతు నేస్తం’ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు.
ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.
భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు.
వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.
ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ హైదరాబాద్ సంచాలకురాలు స్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు.
వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు.
భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

- హోం టూర్ వీడియోల హల్‌చల్
- ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నేటిధాత్రి:
ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్ధిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తొలి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారమని పేర్కొన్నారు. గతంలోలాగా మభ్యపెట్టే కార్యక్రమం కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు ఈ వీడియోలే సాక్ష్యమని తెలిపారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా




- రూ. 376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉపకేంద్రాలు
- ఎర్రవల్లి వద్ద రూ. 155 కోట్లతో ఉపకేంద్రం నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

మహబూబ్‌నగర్, నేటిధాత్రి:
నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉపకేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.
మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.
జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకుని ఆలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కేవీ ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు.
అలాగే ఎర్రవల్లి మండల కేంద్రంలో రూ. 155 కోట్లతో 220/132/33 కేవీ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు.
జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా రూ. 376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ నాగరాజు, డీఈ రవి ప్రసాద్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నగరంలో మరోసారి ఏసీబీ సోదాల కలకలం

- హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు
- ఆదాయానికి మించి ఆస్తులు, బంగారం, నగదు గుర్తింపు



హైదరాబాద్, నేటిధాత్రి:
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసం, కార్యాలయాలతో పాటు 12 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో భారీ స్థాయిలో ఆస్తుల పత్రాలు, ప్లాట్లు, వ్యవసాయ భూములు, నాలుగు బ్యాంకు లాకర్లు, అర కిలో బంగారం, వెండి వస్తువులు, రూ. 10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, 18 విదేశీ మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. అక్రమ ఆస్తులపై మరింత లోతుగా విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

## కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాకు రాష్ట్ర మంత్రుల కృతజ్ఞతలు

హైదరాబాద్, నేటిధాత్రి:
8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేసినందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.
2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాను మంత్రి వాకిటి శ్రీహరి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# ఊరూరా బీఆర్ఎస్ కుట్రలపై ప్రచారం





- కేసీఆర్ హయాంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణుల సూచనల మేరకే నీటి విడుదల: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే కాళేశ్వరం దెబ్బతిందని, దీనికి బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఆధారంగానే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కరవు పరిస్థితుల్లో ప్రజలను రెచ్చగొట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతిపక్షాలకు సూచించారు. రైతులు ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు.




నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక






22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

నేటిధాత్రి

22ND ANNIVERSARY

# 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది “అక్షరం”

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో “21 మైలు రాళ్లు ” దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ “22 వ వసంతం” లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

## “నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో

మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY
వసంతాల అక్షరోద్యమం



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

Corporate Office Address :

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# కాంగ్రెస్ నేత గాండ్ల సమ్మయ్య ను పరామర్శించిన మాజీ మంత్రి బోడ జనార్ధన్



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్యకు ఇటీవల హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్య కారణాలతో ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకున్న మాజీ కార్మిక మంత్రి, తెలంగాణ రక్షణ సమితి పార్టీ నాయకులు బోడ జనార్ధన్ ఆర్కేపీ లోని గాండ్ల సమ్మయ్య నివాసమునకు ఇంటికి వచ్చి ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బోడ జనార్దన్ మాట్లాడారు. గాండ్ల సమ్మయ్యకు నాకు గత 40 సంవత్సరాలుగా రాజకీయంగా,వ్యక్తిగతంగా ఉన్న పరిచయం ఉండని మంచి మిత్రులమని,ఆ బంధంతోనే కలవడం జరిగిందని,ఇందులో ఎలాంటి రాజకీయ ప్రస్తావన లేదని తెలిపారు.

# కర్ణాటక తరహా శాశ్వత నివాస ధృవీకరణ పత్రం (పీఆర్సీ) జారీ చేయాలని తెలంగాణ యోచిస్తోంది

**కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అభిలాష్ రెడ్డి....**



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండల మేదపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ కర్ణాటక తరహాలో శాశ్వత నివాస ధృవీకరణ పత్రం (పీఆర్సీ) విధానాన్ని ప్రవేశపెట్టే అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ ప్రతిపాదనను పరిశీలించేందుకు. ఈ విషయమై ఒక కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సోమవారం తెలిపారు.ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్ ) సమయంలో నివాస ధృవీకరణకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటున్న ఓటర్లకు సౌకర్యం కల్పించేందుకు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా నివసిస్తున్న వారికి ఒకే రకమైన శాశ్వత నివాస పత్రాన్ని జారీ చేయాలని కోరుతూ తాను ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డికి ఒక లేఖ సమర్పించినట్లు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు.ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదనపై ఉన్నతాధికారులతో చర్చించారని. కర్ణాటకలోని విధానాన్ని అధ్యయనం చేయడానికి. తెలంగాణలో కూడా అలాంటి విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు.

# నులిపురుగుల నిర్మూలనతోనే విద్యార్థుల ఆరోగ్యం:

**కోహీర్ మున్సిపల్ చైర్మన్**



**జహీరాబాద్, నేటిధాత్రి:** కోహీర్ మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై తాము ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ (కాంగ్రెస్) స్పష్టం చేశారు. “జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం” సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నపిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపానికి ప్రధాన కారణం నులిపురుగుల సంక్రమణమేనని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ని 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో ప్రతి ఇంటికీ ఈ సందేశాన్ని తీసుకెళ్లాలని చైర్మన్ చెప్పారు. మాత్రలను నమిలి మింగడం ద్వారానే పూర్తి ఫలితం ఉంటుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు. పట్టణ పరిధిలోని మురికివాడలు, వెనుకబడిన వార్డులలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ద్వారా నులిపురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చని చైర్మన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా రోగ్యానికి పెద్దపీట వేస్తోందని, ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడానికి కౌన్సిలర్లు అందరూ క్షేత్రస్థాయి లో సహకరించాలని కోరారు. కోహీర్ పట్టణాన్ని ఆరోగ్యవంతమైన పట్టణంగా మార్చడంలో నులిపురుగులు లేని మున్సిపాలిటీగా మార్చడమే తమ లక్ష్యమని చైర్మన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా విద్యార్థులకు వ్యక్తి గత పరిశుభ్రతపై పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వ దం ద్వారా ఇలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించనున్నారు. మాత్రల పంపిణీ సమయంలో ఏ ఒక్క చిల్డ్ (విద్యార్థి) కూడా మిస్ అవ్వకుండా ఉండేలా వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తా స్థానిక ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ సామాజిక బాధ్యతలో భాగస్వాములు కావాలని చైర్మన్ పిలుపునిచ్చారు.

# మాణిక్ రావు ఉర్దూ నేర్చుకోవాలనుకుంటున్నారు




**జహీరాబాద్, నేటిధాత్రి:** కోహీర్ పర్యటన సందర్భంగా ఉర్దూ జర్నలిస్టులతో మాట్లాడుతూ, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉర్దూ చాలా మధురమైన భాష కాబట్టి తాను దానిని నేర్చుకోవడానికి ఆసక్తిగా ఉన్నానని అన్నారు. దాని పదాలను పలికేందుకు ఒక విధమైన ఆత్మీయత ఉంటుందని ఆయన తెలిపారు. ఉర్దూ బోధించడానికి ఒక ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని తాను నిర్ణయించుకున్నట్లు మాణిక్ రావు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ఉర్దూకు రాష్ట్ర రెండవ అధికార భాష హోదాను కల్పించారని ఆయన తెలిపారు...

# భక్తులతో కిక్కిరిసిన కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం..

**జహీరాబాద్, నేటిధాత్రి:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. మంగళవారం అమావాస్య సందర్భంగా భక్తులతో కిక్కిరిసి పోయింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తదితర ప్రాంతాల భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. మందుగా భక్తులు ఆలయం స్వామి వారి





అమృత పుష్కరిణిలో స్నానాలు ఆచరించి జల లింగానికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు “ఓం నమశ్శివాయ అనే పంచాక్షరి నామాన్ని స్మరిస్తూ” గర్భాలయంలోని శ్రీ పార్వతీ సమేత కేతకి సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా భారీగా తరలివచ్చిన భక్తులకు స్వామి వారి దర్శనం కోసం మూడు గంటల సమయం పడుతోంది. ఇంకా భక్తుల రద్దీ కొనసాగుతోంది.

**స్వామి వారికి ప్రత్యేక పూజలు..** మంగళవారం అమావాస్య సందర్భంగా ఆలయంలోని శ్రీ పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవా, అభిషేకం, క్షీరాభిషేకం, పాలాభిషేకం, మహా మంగళ హారతి క్రతువును నిర్వహించారు. అమ్మ వారికి కుంకుమార్చన మహా మంగళహారతి నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పటేల్ ,ఈవో శివ రుద్రయ్య, తగిన ఏర్పాట్లు చేశారు.

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఝరాసంగం ఎస్సై క్రాంతి కుమార్ పటేల్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# ‘ఏక్ భారత్ శ్రేష్ట భారత్’ క్యాంపుకు జడ్పీహెచ్ఎస్ మొగుళ్లపల్లి విద్యార్థి ఎంపిక

**ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయురాలు ఎస్ భాగ్యశ్రీ...**



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** దేశ సమైక్యత, సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటే ఎన్సిసి “ఏక్ భారత్ శ్రేష్ట భారత్” క్యాంపునకు స్థానిక జడ్పీహెచ్ఎస్ మొగుళ్లపల్లి పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి ఏరా బోయిన జస్వంత్ ఎంపికయ్యాడు.

ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు అదిలాబాదులో జరిగే ఈ క్యాంపులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎన్సిసి క్యాడెట్లు పాల్గొననున్నారు.

ఈ విషయాన్ని పాఠశాల ఎన్సిసి అధికారి గుండెల్లి రాజయ్య తెలిపారు. క్యాంపులో విద్యార్థులు దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలను నేర్చుకోవడంతో పాటు, అన్ని రాష్ట్రాల వారి భాష, ఆచారాల గురించి అవగాహన పెంచుకుంటారని, దేశ ఐక్యత, సమగ్రత అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఎస్. భాగ్యశ్రీ మాట్లాడుతూ, జస్వంత్ ఎంపిక పాఠశాలకు గర్వకారణమని, మున్ముందు మరిన్ని క్యాంపులకు మన పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు టి. వెంకన్న, బి. కుమారస్వామి, కే. ప్రవీణ్, పి. లలిత, జి. విజయభాస్కర్, శ్రీ కల, మజార్ మరియు విద్యార్థినీ విద్యార్థులు జస్వంత్ ను అభినందించారు.


# రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బిజెపి పార్టీయే

**కేటీకే-8 గనిలో సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి...**




**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-8 సింగరేణి గనిలో మంగళవారం సింగరేణి భరోసా యాత్రలో భాగంగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పని శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర బొగ్గు ఉ గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్రరావు హాజరైనారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, దశాబ్దాలుగా దేశ అభివృద్ధికి ఇంధనంగా నిలుస్తున్న సింగరేణి కార్మికుల కృషి దేశానికి ఎంతో విలువైనదని కొనియాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలు, వైఫల్యాల కారణంగా సింగరేణి కార్మికుల్లో అభద్రతాభావం, ఆందోళన పెరిగిందని అన్నారు. సింగరేణిని దేశంలోనే అత్యంత కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థగా బలోపేతం చేయాల్సిన గత ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నాయి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ డిఎంఎఫ్టి నిధుల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జెన్కో సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ. 9,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ బకాయిల కారణంగా సంస్థపై అనవసర ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం సింగరేణి సంస్థకు అప్పు ఉన్న 54 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి అని మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ను సింగరేణికి కేటాయించడం సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిని మరింత బలోపేతం చేసి, పారదర్శక పాలనతో కార్మికుల సంక్షేమాన్ని కాపాడుతూ సంస్థను తిరిగి లాభాల బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్రరావు మాట్లాడుతూ, సింగరేణి తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి సంస్థ అని అన్నారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సింగరేణి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని, కార్మికుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నీ బీజేపీ సహించదన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిని దేశంలోనే ఆదర్శ ప్రభుత్వ రంగ సంస్థగా తీర్చిదిద్దుతామని, కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి ధన్పాల్ సూర్యనారాయణ వెంకటరమణారెడ్డి పైడి రాకేష్ రెడ్డి రామారావు పటేల్ బీజేపీ రాష్ట్ర, కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి బీఎంఎస్ అధ్యక్షుడు అప్పని శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరుకల గణపతి దొంగల రాజేందర్ సింగరేణి కార్మికులు కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేతిలో స్టెతస్కోప్.. గుండెల్లో చరిత్ర: ఆరు సంవత్సరాలుగా పాత నాణేలను సేకరిస్తున్న గ్రామీణ వైద్యుడు





**కోదాడ, నేటిధాత్రి:** ఒకవైపు వైద్యుడిగా మరోవైపు పాతకాలపు నాణేల సేకరణలో ఒక హాబీగా ఆర్.ఎం.పి డాక్టర్ భాష్య కార్ల శ్రీనివాసరావు. కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో ఒక వైద్యుడిగా వైద్య సేవలు అందిస్తూ మరోవైపు పాతకాలపు నాణేలపై ఉన్న అతని శ్రద్ధతో గ్రామీణ ప్రజలకు తన వద్ద ఉన్న ప్రాచీన కాలం నాటి నాణేలను అందరికీ ప్రదర్శిస్తూ చరిత్రను భావితరాలకు పరిచయం చేస్తూ ఉంటారు. అలా పలు గ్రామాల ప్రజలతో ఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అలా తన వృత్తిలో భాగంగా గ్రామీణ ప్రాంతాలను సందర్శిస్తూ ఒక వైపు వైద్యం మరోవైపు పాతకాలపు నాణేలను గత ఆరు సంవత్సరాలుగా నాణేలు సేకరించడం ఒక అలవాటుగా మార్చుకున్నారు. తన వద్దకు వచ్చే రోగులు లేదా గ్రామాల్లోని పెద్దలు ఎవరి వద్దనైనా పాత నాణేలు ఉన్నాయని తెలిస్తే వాటిని స్వీకరించి భద్రపరచుకుంటారు. అలా ఆర్ఎంపీ గా ఉంటూనే ఒక అరుదైన హాబీని కొనసాగించడం ద్వారా ఆ గ్రామ ప్రజలలో ఈ వైద్యుడికి ఒక ప్రత్యేకమైన గౌరవం గుర్తింపులు ఉన్నాయని ఆయన అన్నారు.

# డ్రై డే కార్యక్రమం పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి.డా. ఎంజె లా. అల్ఫ్రేడ్....



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చంద్రంపేట గ్రామంలో. జిల్లా వైద్య ఉ ఆరోగ్య అధికారి. డాక్టర్. ఎంజేల. అల్ఫ్రేడ్. అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. తంగళ్ళపల్లి మండల పరిధిలోని చంద్రంపేట గ్రామంలో డ్రైడే కార్యక్రమశీ లో. భాగంగా. పరిసరాలు పరిశీలించడం జరిగిందని తెలియజేస్తూ ముఖ్యంగా నివాస ప్రాంతాల. నీటి నీలువలు. కూలర్లు. పూల కుండీలు. కొబ్బరి చిప్పలు. టైర్లు. దోమలువల్ల వ్యాధులు.వృద్ధి చెందే అవకాశం ఉన్నందున. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా. పరిసర ప్రదేశాలను పరిశీలించి దోమల నివారణ చర్యలు సక్రమంగా అమలు చేయాలని. సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి మంగళవారం. శుక్రవారం కి రెండు రోజులు తప్పనిసరిగా. డ్రై డే పాటించాలని. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండ చూసుకోవాలని. నీటి . పాత్రలను. శుభ్రపరిచి మూత పెట్టాలని. కూలర్లలో నీటిని .తరచు మార్చాలని. డెంగు. మలేరియా .చికెన్ గున్యా. వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపించే అవకాశం ఉన్నందున. వ్యాధులు నివారించడానికి ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని. ఏమైనా అనుమానిత జ్వరం. తలనొప్పి. ఒళ్ళు నొప్పులు. ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని. అలాగే ప్రజల సహకారంతోనే దోమల నివారణ చర్యలు విజయవంతమైతాయని. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి తెలియజేస్తూ. వైద్య అధికారులు. ముందస్తుగా ప్రజలకు నివారణ చర్యలు పై జాగ్రత్తలు సూచించాలని. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు వైద్యులు ఆశ వర్కర్లు ఉండాలని. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వైద్యాధికారులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో. జిల్లా వైద్యాధికారి. ఉ ఆరోగ్య అధికారి. డాక్టర్. ఎం జైలా. అల్ఫ్రిడ్. తంగళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.( మీనూ) డాక్టర్ స్రవంతి. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్. ఆశ వర్కర్స్. అధికారులు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి.



**దిగ్వాల్ గ్రామ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు వజిత్....**

**జహీరాబాద్, నేటిధాత్రి:** తెలంగాణలో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు, కొత్త పేర్ల నమోదు మరియు తప్పుల సవరణ కోసం బూత్ లెవెల్ అధికారులు ( బి ఎల్ ఓ ) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోహిర్ మండల దిగ్వాల్ గ్రామ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు వజిత్ పిలుపునిచ్చారు. మంగళవారం దిగ్వాల్ లో నిర్వహించిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి మనిషికి ఓటు హక్కు అనేది ఎంతో కీలకమైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బూత్ లెవెల్ అధికారులకు ప్రజలు సరైన సమాచారం అందించి, ఓటర్ జాబితాలో తమ వివరాలు తప్పులు లేకుండా సరిగ్గా ఉన్నాయో లేదో స్వయంగా సరిచూసుకోవాలని సూచించారు.

**ప్రతి బూత్‌లో కాంగ్రెస్ హెల్ప్ డెస్క్...** ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మరియు నమోదు ప్రక్రియలో సహాయం చేయడానికి సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద ‘హెల్ప్ డెస్క్’ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు దిగ్వాల్ గ్రామ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు వజిత్ ఈ సందర్భంగా ప్రకటించారు.

# సర్ ఫామ్ లను బి.ఎల్.ఓ.లకు తొందరగా అందజేయాలి



**జహీరాబాద్, నేటిధాత్రి:** ఓటర్ల జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) లో మీ పూర్తి వివరాలతో ఎన్యుమరేషన్ ఫామ్ లో పొందుపరిచి, బి.ఎల్.ఓ.లకు అందజేయాలని ఝరాసంగం గ్రామ సర్పంచ్ వినోద బాలరాజ్ అన్నారు. ఫామ్ నింపేందుకు తగు జాగ్రత్తలు తీసు కోవాలని,వాటిపై తల్లిదండ్రుల పేర్లు,ఆధార్ కార్డు నెంబర్ తప్పకుండా పొందు పరచాలన్నారు. ఫామ్ వ్రాయడం రాని వారి కోసం గ్రామ పంచాయతీ వద్ద గ్రామ పాలకవర్గం,బి.ఎల్.ఓ. ల పూర్తి సహ కారం ఉంటుందని,ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయతీ వద్దకు వచ్చి,మీ ఫామ్ లను అందజేసి,మీ ఓటు దుర్వినియోగం కాకుండా, కాపాడుకోవాలని సూచించారు. లేదంటే మీ ఓటు రద్దు అయ్యే అవకాశం ఉందని,దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామస్తులందరూ బి.ఎల్.ఓ. లకు సరైన సమాచారం అందజేసి,సహకరించాలని కోరారు.

# 2వ వార్డులో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం



**పరకాల, నేటిధాత్రి:** పట్టణంలోని 2వ వార్డు పరిధిలోని 56వ పోలింగ్ బూత్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 2వ వార్డు కౌన్సిలర్ బొచ్చు శ్యామల అధ్యక్షత వహించారు. ఎమ్మార్వో విజయలక్ష్మి,ఆర్ఐ దామోదర్,సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్,బూత్ లెవల్ ఆఫీసర్ కోడెపాక పూర్ణిమ,బూత్ లెవల్ ఏజెంట్ బొచ్చు బాబురావు(బీఆర్ఎస్),బొమ్మకంటి చంద్రమౌళి (కాంగ్రెస్)పాల్గొన్నారు. అలాగే బొచ్చు తేజ బీఆర్ఎస్ సోషల్ మీడియా,బొచ్చు వరప్రసాద్,బొచ్చు శేఖర్తో పాటు స్థానిక వార్డు సభ్యులు,రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఓటర్ల నమోదు,పేర్ల మార్పులు,కొత్త ఓటర్ల చేర్పు,ఇతర వివరాల సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.


# శాంతి భద్రతల పరిరక్ష లో సీసీ కెమెరాలు కీలకం



**ఎస్సై పరమేష్...**

**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలంలోని అప్పయ్యపల్లి గ్రామంలో సర్పంచ్ కౌడగాని సుప్రియ వినయ్ కుమార్ మరియు గ్రామ పాలకవర్గం సభ్యుల, గ్రామ పెద్దల సహకారంతో రూపాయలు 60 వేల విలు వైన 8 ఐ పి, 4 మెగా పిక్సెల్ సిసి కెమెరాల కోసం ఎస్సై పరమేష్ సమక్షంలో సీసీ కెమెరాలు డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు ప్రతి గ్రామ పెద్దలు ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నేరా ల నియంత్రణలో భాగస్వా ములు కావాలని ఎస్ఐ పరమేష్ కోరారు.

# ప్రాజెక్టులో నీటి నిల్వపై రైతుల ధర్నా




రోడ్డు ఎక్కిన రైతన్నలు...

**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలం జోగంపల్లి గ్రామంలోని చలువాగు ప్రాజెక్టులో నీటి నిల్వలు వాటి సరఫరాపై అన్యాయం జరుగుతుందని



ఆరోపిస్తూ అన్ని గ్రామాల్లోని రైతులు ధర్నాలు చేపట్టారు ప్రస్తుత నీటిమట్టం 16 టీఎం సీలు ఉండాలి కానీ ప్రస్తుతం 11 టీఎంసీలు ఉండడం చూసిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు రైతు నీటి నిల్వ పై అధికారులకు ఫోన్ చేసి మోటార్లను బందు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల రైతులు అధిక మొత్తంలో పాల్గొన్నారు.

# ఫ్లాష్...ఫ్లాష్..



2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఏఈ...

**పెద్దపల్లి, నేటిధాత్రి:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అవినీతికి పాల్పడిన మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏఈ సతీష్, ఏసీబీ అధికారులకు చిక్కాడు. కాంట్రాక్టర్ కు సంబంధించిన బిల్లు ప్రాసెస్ చేయడానికి రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసి అదే మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో కరీంనగర్ రేంజ్ అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్ పనికి సంబంధించిన బిల్లు విడుదల చేయాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని ఏఈ సతీష్ సంబంధిత కాంట్రాక్టర్ ను లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం పలుమార్లు ఒత్తిడి చేసినప్పటికీ లంచం ఇవ్వడానికి నిరాకరించిన కాంట్రాక్టర్ చివరకు కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి పక్కా ప్రణాళికతో ఉచ్చుపన్నారు మంగళవారం పెద్దపల్లి పట్టణంలోనీ ఏఈ సతీష్ నివాసానికి కాంట్రాక్టర్ ను పంపించి ముందుగా రసాయన పూత పూసిన కరెన్సీ నోట్లను అందజేశారు. ఏఈ సతీష్ రూ2 లక్షలు స్వీకరించిన సమయంలో ఏసీబీ అధికారులు ఒక్క సారిగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు అనంతరం నిందితుడికి ఫైనాఫాలిన్ పరీక్ష నిర్వహించగా. ఆయన చేతులకు రసాయన పరీక్ష పాసిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు, లంచంగా తీసుకున్న నగదు తో పాటు కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన ఫైళ్ళు బిల్లులు సంబంధింత పత్రాలను కూడా అధికారులు పరిశీలించారు కేసుకు సంభందించిన కీలక ఆధారాలను సేకరించి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ ఏసీబీ ట్రాప్ ఆపరేషన్ కరీంనగర్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది నిందితుడిపై అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వైద్య పరీక్షల అనంతరం కరీంనగర్లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తావు లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా విధులు నిర్వహణలో లంచాలు డిమాండ్ చేసిన లేదా స్వీకరించిన ప్రజల వెంటనే ఏసీబీ ని ఆశ్రయించాలని అధికారులు సూచించారు ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జి ఎస్ ఆర్.



**చిట్యాల, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రోజున భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది, ఇందులో భాగంగా 51 మంది లబ్ధిదారులు గాను అక్షరాల 51,05916.00 రూపాయలు చెక్కుల పంపిణీ చేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ప్రజా పాలన అందించడంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సుభిక్షంగా సాగుతుందని అన్నారు, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాలు పేద ప్రజలకు వరమని అన్నారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వసంతరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి, టౌన్ అధ్యక్షులు గంగాధర రవీందర్,గ్రామ సర్పంచ్ తవుటం లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు రాయ కొమరు,శ్రీనివాసు మొగిలి సుమన్,సదయ్య, లబ్ధిదారులు మాజీ సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల దృష్ట్యా వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసిన అధికారులు..

**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం. పలు గ్రామాలలో. మండల పంచాయతీ అధికారులు వైద్యాధికారులు గ్రామాల్లోని నీటి శుద్ధజలకేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఇటీవల మండలంలో పలు గ్రామాలలో టైఫాయిడ్ కేసులు పెరుగుతున్న నేసేద్యంలో. జిల్లా కలెక్టర్ పై అధికారుల ఆదేశానుసారం. మండలంలో జిల్లెల్ల నేరెళ్ల గ్రామాలలో. గ్రామపంచాయతీ మరియు వైద్య అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టామని. ఇందులో భాగంగా. వాటర్



ప్లాంట్లలో కనీస .టిడిఎస్ ఉండాల్సిందేనని. తాగునీటిలో కనీసం టిడిఎస్. స్థాయి.50. నుండి.200. వరకు ఉండాలని అంతకంటే తక్కువ .టీడీఎస్. ఉన్న నీటిని వాటర్ ప్లాంట్ ల వారు అమ్మకూడదని. ప్రజల.కూడా కొనవద్దని అధికారులు స్పష్టం చేస్తూ. ఇటీవల కాలంలో జిల్లెల్ల నేరెళ్ల.పరిధిలోని .టైఫాయిడ్ .కేసులు పెరుగుతున్నందున. ముందు జాగ్రత్తగా. ఈ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని. కలుషిత నీటి వల్ల .టైపాడ్ .కలరా డయేరియా .వంటి వ్యాధులు .వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని. తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ముఖ్యంగా వర్షాకాలంలో. ప్రజలు కాచి చల్లార్చ .నీటిని .మాత్రమే తాగాలని కూరగాయలు పండ్లను. శుభ్రంగా కడిగిన తర్వాత. తినాలని. ముందస్తుగా వ్యాధులు ప్రబలించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని. డ్రైనేజీలు మోర్లలో నీటి నిల్వ ఉండకూడదని. ఏమైనా. అనుమానాలు ఉంటే అత్యవసరంగా చికిత్సలు చేయించుకోవాలని. ముఖ్యంగా కలుషిత నీరు తాగొద్దని. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి తనిఖీల లో. వైద్య అధికారి డాక్టర్ చంద్రిక రెడ్డి. మండల పంచాయతీ అధికారి మీర్జా. ఏఈ వెంకటేశం. సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన.. ట్రాఫిక్ ఎస్సై యాదవేందర్ రెడ్డి



**సూర్యాపేట, నేటిధాత్రి:** పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్సై యాదవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆటో నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను కలిగి ఉండాలి.మద్యం సేవించి వాహనం నడపరాదు మద్యం మత్తులో ఆటోలు నడపడం వల్ల అమాయక ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు.ట్రాఫిక్ సిగ్నల్ నియమాలు: జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సిగ్నల్ జంపింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులు ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల

**పరకాల,నేటిధాత్రి:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సోమవారం పరకాల పట్టణంలో విస్తృతంగా పర్యటించారు.



ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ముందుగా పరకాల పట్టణానికి చెందిన బొచ్చు రమేష్ కుమారుడు,ప్రముఖ బాడీ బిల్డర్ ప్రసంగి



ఏడు నెలల క్రితం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, సుదీర్ఘకాలం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం సోమవారం డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.అనంతరం పరకాల పట్టణానికి చెందిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జాఫర్ రిజ్వీ నివాసానికి వెళ్లి,అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితి,అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకుని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.తదుపరి ఇటీవల మృతిచెందిన పరకాల పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చందుపట్ల చిన్న మల్లారెడ్డి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు.

# చిట్యాల లో కలశాల ల బంధు విజయవంతం.

ఎబివిపి నగర కార్యదర్శి అజేయ్.

**చిట్యాల, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థలు బంద్ లో భాగంగా చిట్యాల మండలంలోని కళాశాలలను మంగళవారం రోజున ఎబివిపి చిట్యాల నగర కార్యదర్శి ముష్కే అజయ్ ఆధ్వర్యంలో బంద్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం



విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేయడానికి కుట్రలు చేస్తుందని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని అన్నారు ప్రభుత్వానికి విద్యారంగం మీద చిత్తశుద్ధి లేదని వెంటనే పదివేల కోట్ల బగాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అబిగ్న గౌడ్, వితేష్, అభిరామ్ కౌశిక్ ,తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్‌లు ప్రారంభం

ఓటర్ల జాబితా సవరణకు ప్రజలు సహకరించాలి....

**సిరిసిల్ల, నేటిధాత్రి:** మంగళవారం సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు ఆధ్వర్యంలో తెలంగాణలో ఓటర్ల జాబితాను తప్పుల్లేకుండా రూపొందించేందుకు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంగీతం



శ్రీనివాస్ పిలుపునిచ్చారు.6, 7 వార్డుల్లో ఏర్పాటు చేసిన ఓటర్ల హెల్ప్ డెస్క్ కార్యక్రమంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జూలై 18, 2026లోపు ప్రజలు బూత్ లెవెల్ అధికారులకు సరైన వివరాలు అందించి, ఓటర్ల జాబితాలో తమ పేరు, చిరునామా తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడుతూ, ఓటర్లలో అవగాహన కల్పించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ ప్రక్రియలో సహాయపడేందుకు పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, సూపర్వైజర్లు సబ్బని వేణు, బొప్ప దేవయ్య, కాంగ్రెస్ నాయకులు కంసాల మల్లేశం, అలువాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 18న బీఆర్ఎస్ ‘ఛలో సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సు’



ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్....సరూర్‌నగర్ స్టేడియంను పరిశీలించిన బీఆర్ఎస్ ప్రముఖ నేతలు...

**కుత్బుల్లాపూర్, నేటిధాత్రి:** కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 18న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ‘ఛలో సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సు’ గోడ పత్రికను, సదస్సు స్థలాన్ని మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య నేతలు పరిశీలించారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే ఈ భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ ‘యూత్ డిక్లరేషన్’ పేరిట నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని మండిపడ్డారు. విద్యార్థులను, నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేసిన ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఈ సదస్సును భారీ ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, నోముల భగత్, నాయకులు బంటి, అవినాష్ రెడ్డి, ముఠా జైసింహా, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, బాలరాజు యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు విద్యాసాగర్, రాష్ట్ర నాయకులు డా.కురువ విజయ్ కుమార్, ధర్మేందర్ రెడ్డి, తుంగబాలు, కాడరి స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రామ్‌రెడ్డి నగర్‌లో ఘనంగా 50వ ఉచిత వైద్య శిబిరం

సందర్శించిన రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, నేటిధాత్రి:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రామ్‌రెడ్డి నగర్ కాలనీలో మంగళవారం నిర్వహించిన 50వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ ఉ కో-ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాలను రామ్‌రెడ్డి నగర్ కాలనీ



వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాజ సేవే ధ్యేయంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మణికంఠ, వెంకటేష్ (గున్ని), సింధేష్ చౌదరి, అయ్యప్ప నాయుడు, దిలీప్ సింగ్, రమేష్, వినయ్, సుధీర్, సాధు యాదవ్, నర్సింహారెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీధర్ రెడ్డి, గజ, టిటికె శ్రీను, కాలనీ వాసులు మరియు టీమ్ బికెఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈ నెల 20 వరకు ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ....

**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్న ఓటర్ల నవోదు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా 306 పోలింగ్ కేంద్రంలో పరిధిలో బీఎల్ఓ గీత నిర్వహిస్తున్న నవోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తూ, రోజువారీ నమోదు వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన నమోదు ప్రక్రియను రానున్న ఐదు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియను ఎన్నికల సంఘం యాప్ ద్వారా సులభంగా ఓటరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు ఎన్యూమరేషన్ నమోదు ఫారాలను పూర్తి చేయడంలో ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ఓల సహాయం పొందవచ్చని స్పష్టం చేశారు. ఓటరు జాభితా పారదర్శకత కోసం మరణించిన వారు, వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం జాబితా



నుండి తొలగించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, గడువులోగా వంద శాతం పూర్తి చేయడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ డిడి డా కుమారస్వామి, వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల గుర్తింపు కాలగర్భంలో కలిసినట్లేనా...?



**పెద్దారపు రమేష్, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి....**

**హైదరాబాద్, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కౌలు రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని ఎంతో మంది ఆశించారు. కానీ వారి ఆశలు నెరవేరలేదు. పెనం నుంచి పొయ్యిలో పడినట్లుగా కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తున్న కౌలు రైతులకు గుర్తింపు లేకపోవడం విచారకరం. ఇది వ్యవసాయ రంగాన్ని పరోక్షంగా కార్పొరేట్ వ్యవసాయానికి అప్పగించే విధానంగా మారుతోంది.పంటల ఉత్పత్తిలో కౌలు రైతుల పాత్ర అత్యంత కీలకమని నీతి ఆయోగ్ కూడా పేర్కొంది. భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేకపోయినా, కౌలు రైతుల శ్రమతోనే పంటలు పండుతున్నాయి. అయితే కౌలు పేరుతో భూ యజమానులు, అప్పుల పేరుతో వడ్డీ వ్యాపారులు, పంటల కొనుగోలు పేరుతో మధ్యవర్తులు, సరైన మార్కెట్ సౌకర్యాలు కల్పించకపోవడం, కనీస మద్దతు ధర అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కౌలు రైతులు బహుముఖ దోపిడీకి గురవుతున్నారు.రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులు ఉంటే, వారిలో దాదాపు 25 లక్షల మంది కౌలు రైతులే. అంటే వ్యవసాయ ఉత్పత్తిలో అత్యంత కీలకమైన వర్గం వీరే. అయినప్పటికీ, అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కౌలు రైతులను గుర్తిస్తామని హామీ ఇచ్చి కూడా ఆచరణలో విఫలమైంది. తెలంగాణ ఏర్పడిన 2014లో ఒక్క కౌలు రైతుకూ గుర్తింపు కార్డు ఇవ్వలేదు. 2015లో జీవో నెం. 282 ద్వారా కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించినా, కేవలం 43,500 మందికి మాత్రమే గుర్తింపు కార్డులు జారీ చేశారు. వారిలో కూడా సుమారు 8 వేల మందికి మాత్రమే రూ.26 కోట్ల పంట రుణాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కౌలు రైతుల గుర్తింపుపై ఎలాంటి పురోగతి లేదు.'బంగారు తెలంగాణ', 'ప్రజా పాలన' అంటూ గొప్పలు చెప్పుకునే పాలకులు కౌలు రైతులను గుర్తించకుండా వ్యవసాయాభివృద్ధి ఎలా సాధ్యమో సమాధానం చెప్పాలి. సన్న, చిన్న, కౌలు రైతులను ఆదుకోకుండా రైతుల ఆత్మహత్యలను ఎలా అరికడతారు?స్వాతంత్ర్యం అనంతరం కౌలుదారుల హక్కుల పరిరక్షణ కోసం 1950లో రక్షిత కౌలుదారుల చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే భూస్వాముల వ్యతిరేకత, అధికార వ్యవస్థలో వారి ప్రభావం కారణంగా ఆ చట్టం సమర్థంగా అమలు కాలేదు. దీంతో కౌలుదారుల పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది.ఈ నేపథ్యంలో 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ల్యాండ్ లైసెన్స్ కల్టివేటర్స్ యాక్ట్--2011ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు లోన్ ఎలిజిబిలిటీ కార్డులు (రాజుజ) జారీ చేసి నాలుగు ప్రధాన ప్రయోజనాలు కల్పించాల్సి ఉంది. అవి---పంట రుణాలు, పంట బీమా, పంట నష్టపరిహారం, సబ్సిడీలు మరియు ఇతర రాయితీలు. ఇందుకోసం రెవెన్యూ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి, ఫీల్డ్ విచారణ అనంతరం గుర్తింపు కార్డులు జారీ చేయాల్సి ఉంటుంది.2012లో ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 6.85 లక్షల మంది కౌలు రైతులు దరఖాస్తు చేయగా, ఐదు లక్షల మందికి గుర్తింపు కార్డులు ఇచ్చి రూ.390 కోట్ల పంట రుణాలు అందించారు. 2013లో 4.80 లక్షల మంది దరఖాస్తు చేయగా, 3.90 లక్షల మందికి గుర్తింపు కార్డులు జారీ చేసి, వారిలో 2.30 లక్షల మందికి పునరుద్ధరణ (రెన్యూవల్) చేశారు. మొత్తం రూ.133 కోట్ల పంట రుణాలు అందించారు.చట్టం ప్రకారం ప్రతి ఏడాది మే నెలలో, ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తించాలి. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఈ ప్రక్రియ ఎక్కడా అమలు కావడం లేదు. భూ యజమాని అనుమతి అవసరం లేదని చట్టం స్పష్టంగా చెబుతున్నప్పటికీ, రెవెన్యూ అధికారులు భూ యజమానుల అభ్యంతరాలను సాకుగా చూపుతూ దరఖాస్తులను నిర్లక్ష్యం చేస్తున్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కౌలు రైతుల విషయంలో నిరాశాజనక వైఖరినే అవలంబిస్తోంది.

ఎన్నికల సమయంలో కౌలు రైతులను గుర్తించి ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయడం లేదు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు రైతు భరోసా,

రైతు బీమా వంటి సంక్షేమ పథకాలు వర్తించకపోవడం అత్యంత విచారకరం.ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు పెరగడం, మరోవైపు కౌలు రేట్లు అధికమవడం, ప్రకృతి వైపరీత్యాలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయడం వంటి కారణాలతో కౌలు రైతులు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నారు. పంట పండించినా వచ్చిన ఆదాయం వడ్డీలకే సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

సమాజ శ్రేయస్సు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే కౌలు రైతులు నేడు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను అధికారికంగా గుర్తించి, వారికి పంట రుణాలు, బీమా, నష్టపరిహారం, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం అత్యవసరం.

అదే వ్యవసాయ రంగానికి, రైతు కుటుంబాలకు, రాష్ట్రాభివృద్ధికి నిజమైన న్యాయం చేసినట్లవుతుంది. సెల్: 8500313310, 9381375276.

# శంకర ఐ ఫౌండేషన్--జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు వైద్య శిబిరం



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించేందుకు శంకర ఐ ఫౌండేషన్, జనతా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తెలిపారు.ఈ వైద్య శిబిరం జూలై 15 (బుధవారం) న నర్సంపేట పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నారు. నర్సంపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కంటి సమస్యలతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో పాటు సంబంధిత మొబైల్ ఫోన్ నంబర్ తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి అర్హులైన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నూతన ప్రభుత్వ హైస్కూల్ ప్రారంభం.



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో. హై స్కూల్ భవనాన్ని నిర్మించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా. తంగళ్ళపల్లి గ్రామ సర్పంచ్ మోర లక్ష్మీరాజశీ. మాట్లాడుతూ మన తంగళ్ళపల్లి గ్రామంలో నూతన ప్రభుత్వ హైస్కూల్ భవనాన్ని విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని. కేవలం ఊరి అభివృద్ధి ముఖ్యమని నా నమ్మకం అని. ఎక్కడ రాజకీయం చూడకుండా మన పిల్లల చదువుల కోసం పెద్దమనిసుతో .పర్మిషన్లు. ఫండ్స్. త్వరగా వచ్చేలా పూర్తి సపోర్ట్ అందించారని పార్టీలు .వేరైనా. ఊరి బాగు కోసం .కలిసి పని చేయవచ్చని. మన గ్రామం. ప్రజలు. నిరూపించిందని. బడి బాగుంటేనే. మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందని. ఎన్నికల వరకే రాజకీయం .ఆ తర్వాత కేవలం అభివృద్ధి ముఖ్యమని. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సర్పంచిగా ఉన్న. మొదటినుంచి కష్టపడ్డాన ని ఎన్నికల వరకే రాజకీయమని. తర్వాత కేవలం ఊరి అభివృద్ధి ముఖ్యమని. కాంగ్రెస్ సర్పంచ్ అయిన. బి .ఆర్. ఎస్. ఎమ్మెల్యే గౌరవనీయులు. కేటి రామారావు. ఇక్కడ రాజకీయం చూడకుండా మన పిల్లల చదువుల కోసం. పెద్ద మనసుతో ఫండ్స్. పర్మిషన్లు త్వరగా వచ్చేలా పూర్తి సపోర్ట్ సహకారం.అందించారని. అలాగే ఈ భవన నిర్మాణానికి .సహకరించిన సిరిసిల్ల ఎమ్మెల్యే కేటి రామారావుకి. వార్డు మెంబర్లకి. గ్రామ ప్రజలకు అధికారులకు. నాకు సహకరించిన నాయకులకు అధికారులకుపేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. అని ఈ సందర్భంగా .తంగళ్ళపల్లి గ్రామ సర్పంచ్ మోర లక్ష్మీరాజశీ. తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో. గ్రామపంచాయతీ పాలకవర్గం. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు. గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మెమోరండం ఇచ్చిన ఏఐటీయూసీ నాయకులు

**తాడిచర్ల ఓసి2 ను సింగరేణి కి కేటాయించినందుకు కేంద్రమంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు**



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేయబోయే వీవీ నరసింహారావు (వివిఎన్ఆర్) వెంకటపురం ఓసి కి ఎన్ఓసి క్లియరెన్స్ ఢిల్లీ నుంచి ఇప్పించగలరని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డిని ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు.

మంగళవారం భూపాలపల్లి లో సింగరేణి భరోసా యాత్రలో భాగంగా కేటీకే 8ఇంక్లైన్ లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి.రాజ్ కుమార్ ఆదేశాల మేరకు ఫిట్ సెక్రటరీ ఎల్ శంకర్ ఆధ్వర్యంలో మెమోరండం అందజేశారు.సింగరేణి సంస్థ భవిష్యత్ అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తి పెంపునకు, కార్మికుల దీర్ఘకాలిక ఉపాధి భద్రతకు ఎంతో కీలకమైన తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ ను సింగరేణి సంస్థ కు కేటాయించినందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ..భూపాలపల్లి ఏరియాలో ప్రతిపాదించిన పివిఎన్ఆర్ (వెంకటాపురం) ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించి, చారిత్రాత్మక రామప్ప గుడిపై ప్రాజెక్ట్ యొక్క ప్రభావాన్ని అంచనా వేసే ఎన్ ఓ సి (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) అనుమతి ప్రస్తుతం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏ ఎస్ ఐ) న్యూ ఢిల్లీ వారి వద్ద పెండింగ్లో ఉన్నదని వాటి క్లియరెన్స్ అనుమతులు ఇప్పించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు.బొగ్గు నిల్వలు, ఉత్పత్తి సామర్థ్యం: ఈ ప్రాజెక్ట్ పరిధిలో దాదాపు 40.43 మిలియన్ టన్నుల అత్యంత విలువైన బొగ్గు నిల్వలు ఉన్నాయని సంవత్సరానికి 2.50 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు అనుమతుల కొరకు కేంద్రమంత్రికి ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నుండి వివరించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ ఏరియా ఇన్చార్జి నూకలచంద్రమౌళి,బ్రాంచి ఆర్గనైజింగ్ సెక్రటరీ జగత్ రావు, ఓసి--3 పిట్ సెక్రటరీ కృష్ణా రెడ్డి,అసిస్టెంట్ పిట్ సెక్రటరీ శ్రీకాంత్,పిట్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్,మైన్స్ కమిటీ సభ్యులు పల్లి.కృష్ణ,మణిసాగర్,సేఫ్టీ కమిటీ సభ్యులు ఎస్.శ్రీనివాస్, షిఫ్ట్ ఇంచార్జిలు, అసిస్టెంట్ షిఫ్ట్ ఇంచార్జిలు, టెంపుల్, క్యాంటీన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దుగ్గి సుధాకర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పొంబోయిన ముత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎస్కె ఖదీర్**

**గుండాల, నేటిధాత్రి:** గుండాల మండల పరిధిలోని రోళ్లగడ్డ గ్రామ పంచాయతీ నర్సాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దుగ్గి సుధాకర్ కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కారణం మృతి చెందారు.పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పొంబోయిన ముత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎస్కె ఖదీర్ దుగ్గి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబాన్ని పార్టీ తరుపున ఎన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తాం అని అధైర్య పడవద్దని తెలియజేసి అలాగే దశ దిన కార్యక్రమాలకు పదివేల రూపాయల 10000 ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊకే బుచ్చయ్య, రోళ్లగడ్డ సర్పంచ్ భూక్య మంగమ్మ, ఎస్సి సెల్ అధ్యక్షులు గుర్రం పుష్పరాజ్, వార్డు మెంబర్ గుగులోత్ బద్రు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోకాళ్ళ శంకర్, వాంకుడోత్ రమేష్, భూక్య శ్రీను, బొర్రా వెంకటేశ్వర్లు, నూనావత్ రవి, సనప సీతారాములు, సనప గోవింద్,ఎస్కె ఇస్రార్, పల్లపు రాజేష్, గడ్డం రాజేష్, బొంగు చంద్రశేఖర్, మాలోత్ కళ్యాణ్, సోషల్ మీడియా నాయకులు మండలోజు కిరణ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఆర్టీసీ ఆర్ఎంను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ ఉద్యోగులు



**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) వరంగల్ రీజినల్ మేనేజర్ ఎస్. భవానీ ప్రసాద్ ను నర్సంపేట ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.వరంగల్ ఆర్ఎం భవానీ ప్రసాద్ నర్సంపేట డిపోను సందర్శించిన సందర్భంగా, నర్సంపేట డిపో మేనేజర్ మామిడాల సరస్వతి, ఆర్ఎం సహాయ మేనేజర్ భవాని ఆధ్వర్యంలో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ అధ్యక్షుడు గొలనకొండ వేణు నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సంపేట డిపో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం చైర్మన్ గుండెబోయిన హరి ప్రసాద్, డిపో కార్యదర్శి బొడిగె రాజు, సోమ మాధవ్, మునుకుంట్ల రాంబాబు, మడిపెద్ది మొగిలి, విశ్రాంతి డ్రైవర్ దుడ్డె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.సమావేశంలో బీసీ ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు, సంక్షేమ చర్యలపై ప్రతినిధులు ఆర్ఎంతో చర్చించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

# యువతి ఆత్మహత్య కేసులో దర్యాప్తు వేగవంతం చేసిన జైపూర్ పోలీసులు

**సూసైడ్ నోట్,మొబైల్, వాంగ్మూలాల ఆధారంగా కొనసాగుతున్న విచారణ....**

**నిందితులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు...**




**జైపూర్, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన యువతి గోషిక మాధవి ఆత్మహత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు గోనె వెంకటేష్‌తో పాటు అతని తల్లి గోనె శంకరమ్మ,అక్క గోనె శైలజలను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు.నేర ఒప్పుకోలు పంచనామా నిర్వహించిన అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు జైపూర్ సీఐ నవీన్ కుమార్,ఎస్సై భూమేష్‌తో కలిసి వెల్లడించారు.పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడు వెంకటేష్ రెండేళ్ల క్రితం మాధవితో పరిచయం ఏర్పడిందని,ఆమె అంగీకరించకపోయినా ప్రేమ పేరుతో తరచూ వెంటపడుతూ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినట్లు ఒప్పుకున్నాడు.ఈ విషయాన్ని తన తల్లి,అక్కకు చెప్పగా,వారు కూడా ఆమెను వదలొద్దని ప్రోత్సహించినట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం ముగ్గురూ కలిసి యువతి ఇంటికి వెళ్లి వివాహం చేయాలని కోరగా,కుటుంబ సభ్యులు నిరాకరించారని తెలిపారు.దీంతో పెళ్లి చేయకపోతే ఆమె పేరుతో తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.జూలై 10న గోదావరిఖనిలో మాధవిని కలిసి మరోసారి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసి,అంగీకరించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు విచారణలో తేలిందన్నారు.జూలై 11న పెద్దల సమక్షంలో జరిగిన పంచాయతీలో కూడా యువతి కుటుంబం వివాహానికి నిరాకరించగా,నిందితుడి తల్లి,అక్క బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.నిందితుడు ఉపయోగించిన వివో మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఆ ఫోన్ ద్వారానే మాధవికి తరచూ కాల్స్ చేసినట్లు విచారణలో తేలిందని, ఫోన్‌లోని సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.సూసైడ్ నోట్, మొబైల్ డేటా,నిందితుల వాంగ్మూలాలు తదితర ఆధారాలపై కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రవేశాలకు ఆగస్టు 7 వరకు గడువులి



**నర్సంపేట, నేటిధాత్రి:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. పూర్ణచందర్ తెలిపారు. ప్రవేశాలకు చివరి తేదీ ఆగస్టు 7 అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం చేస్తూనే లేదా ఇతర కారణాలతో రెగ్యులర్ విద్యకు దూరమైన వారు దూరవిద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అలాంటి వారికి అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తక్కువ ఫీజుతో నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.డాక్టర్ వి. పూర్ణచందర్ మాట్లాడుతూ, డిగ్రీలో ప్రవేశం పొందే విద్యార్థులు లర్నర్ సపోర్ట్ సెంటర్--229, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేటను ఎంపిక చేసుకోవాలని కోరారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు రెగ్యులర్ ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, రెండేళ్ల ఐటీఐ లేదా పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు.ఈ సమావేశంలో కళాశాల కార్యాలయ సిబ్బంది కే. నరేష్, బి. శివతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 73829 29577 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# జీరో వన్ జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలి



**టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్...**

**కేసముద్రం, నేటిధాత్రి:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలోకేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ మరియు ప్రధాన కార్యదర్శి నర్సింహా రాజు నేతృత్వం లో నిర్వహించిన సభ్యత్వ నమోదు సమస్యల సేకరణ కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్ కల్వల పాఠశాలను సందర్శించనైనది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ లలో పనిచేసే ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ లో పనిచేసే ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెల్త్ కార్డు సౌకర్యాన్ని వారికి వర్తింప చేయాలని ఇప్పటివరకు మోడల్ స్కూల్ లలో పనిచేసే ఉపాధ్యాయులు దాదాపు 45 మంది పైగా మరణించారని ఆ మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక ప్రక్రియను వర్తింపచేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి తెలంగాణ పబ్లిక్ స్కూలులు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పి వాటికి ఐదు ఎకరాల స్థలం 15 కోట్ల రూపాయలు మరియు ఐదు బస్సులు కేటాయిస్తామని మాట మార్చి నేడు 194 మోడల్ స్కూల్ లను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చి 12 కోట్ల రూపాయలు కేటాయించి డిజిటలైజ్ చేస్తామని చెప్పడం లో అర్థమేంటని తక్షణమే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటును వెనుకకు తీసుకొని రాష్ట్రంలో కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూల్లో ఫిజికల్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని మోడల్ స్కూల్లో గ్రేడ్ 2 హిందీ పండిట్ పోస్టులు అవర్ లీ బేస్డ్ గా ఉన్నాయని వాటిని తక్షణమే రెగ్యులరై చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు మోడల్ స్కూల్ హాస్టల్ బాధ్యతలు పూర్తిగా ప్రిన్సిపాల్ లకు అప్పగించి సక్రమంగా నడిచేలా ప్రభుత్వం చర్యలు గైకొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బి. అంజయ్య, కార్యదర్శులు ఊట్కూరి ప్రణయ్ కుమార్,వీసం నర్సయ్య జి. శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన పెండెం రామానంద్

**పకడ్బందీగా పూర్తి చేయాలని బీఎల్ఏలకు సూచన....**



**నర్సంపేట, నేటిధాత్రి:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ బీఎల్ఏలకు సూచించారు.మంగళవారం నర్సంపేట పట్టణంలోని 25వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను స్వయంగా అందజేసి, బీఎల్ఏల ద్వారా క్షేత్రస్థాయిలో వాటిని పూరింపజేసే ప్రక్రియను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాలను నిబంధనలకు అనుగుణంగా ఖచ్చితంగా పూర్తి చేయాలని, ఓటర్ల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. అవసరమైన సవరణలు సకాలంలో చేపట్టి, అర్హత కలిగిన ప్రతి ఓటరికి పూర్తి సహకారం అందించాలని బీఎల్ఏలకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, నర్సంపేట సొసైటీ డైరెక్టర్ కీసర వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి చిప్ప నాగ, కాంగ్రెస్ నాయకులు కిసరి నరేందర్, నాడెం ప్రదీప్ కన్నా, మేరుగు కిరణ్, కీసరి రాంబాబు, కాట అఖిల్, ముద్రబోయిన రాజు, నల్లగొండ వంశీ, పొలబోయిన ప్రణయ్, భూక్యా గణేష్, ముత్యాల కమల్, అందె రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



దుగ్గొండి, నేటిధాత్రి: దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామంలో అనారోగ్య బాధిత కుటుంబం గాజు చిన్న రాజయ్యకు రూ.44000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ సర్పంచ్ ద్యాగం సుజాత సుధాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంట రాజుకుమార్, ఉప సర్పంచ్ బోయిని రంజిత్,వార్డు సభ్యులు ఎరుకల పద్మ,ద్యాగం రాణి నర్సింగం,నాయకులు,గ్రామస్తులు గొర్రె రవి,కుక్కముడి సాంబయ్య,ఎరుకల సురేష్,గట్ల మణమ్మ,సల్వాల రాజుక్క,ద్యాగం శివాజీ,కుక్కముడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సిబ్బందితో వెట్టి చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం

**తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి...**



నర్సంపేట, నేటిధాత్రి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో గౌరవ వేతనం పేరుతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (టీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ఐసీడీఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు దాటినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికీ అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించలేదని విమర్శించారు. గౌరవ వేతనాల పేరుతో శ్రమ దోపిడీ జరుగుతోందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జాబ్ చార్ట్ ప్రకారం పూర్వ ప్రాథమిక విద్యతో పాటు ఆరోగ్య లక్ష్మి సేవలు, ఎన్‌హెచ్‌టీఎస్, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నప్పటికీ, చాలీచాలని వేతనాలతోనే కుటుంబాలను పోషించాల్సి వస్తోందని తెలిపారు. దీనికి తోడు బీఎల్‌వో విధులు, ఇతర అదనపు పనులు అప్పగించడంతో అంగన్‌వాడీ సేవలు దెబ్బతింటున్నాయని, అధిక పని ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల రావాల్సిన గౌరవ వేతనాల కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు చిరు ఉద్యోగులందరికీ ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు అందజేస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ జూన్ నెల గౌరవ వేతనాలు చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న జూన్ నెల గౌరవ వేతనాలను విడుదల చేయడంతో పాటు, వచ్చే నెల నుంచి కనీసం ప్రతి నెల 5వ తేదీలోపు గౌరవ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నల్ల భారతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సహకరించాలి



**కొక్కిరాల రాకేష్ రావు**

పరకాల, నేటిధాత్రి: ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ (ఎస్ఐఆర్)కార్యక్రమంలో భాగంగా కొక్కిరాల రాకేష్ రావు స్థానిక బూత్ లెవెల్ అధికారులకు(బీఎల్ఓలు),బూత్ లెవెల్ ఏజెంట్లకు(బీఎల్ఏలు)ఓటరు నమోదు,సవరణకు సంబంధించిన ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కొక్కిరాల రాకేష్ రావు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక తీవ్ర సవరణ(ఎస్ఐఆర్)కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలనే ఉద్దేశంతోనే బీఎల్ఓలు,బీఎల్ఏలకు అవసరమైన ఫారాలను అందజేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న బీఎల్ఓలకు ప్రజలు పూర్తి సహకారం అందించి,ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి వెంకటేష్, నాగరాజు,కృపేందర్ రెడ్డితో పాటు బీఎల్ఓ రజిత పాల్గొన్నారు.

# జాతీయ బాక్సింగ్ కోచ్‌గా మంథని సందీప్



శ్రీరాంపూర్, నేటిధాత్రి: శ్రీరాంపూర్ ప్రాంతంలోని కృష్ణకాలనీకి చెందిన మంథని విజయ--పోచం దంపతుల కుమారుడు మంథని సందీప్ పంజాబ్‌లోని పటియాలలో నిర్వహించిన అఖిల భారత ఎన్ఎస్-ఎన్ఐఎస్ బాక్సింగ్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికై శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. కోచ్ సర్టిఫికెట్‌ను మంచి గ్రేడ్‌తో సాధించి స్వస్థలానికి చేరుకున్న సందీప్‌కు ఆయన కోచ్ జగత్ సాయి, మంచిర్యాల జిల్లా బాక్సింగ్ సంఘం సభ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సందీప్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బాక్సింగ్ అసోసియేషన్ తరఫున ఆయనకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు యుగేందర్ సాయి, సుందిళ్ల నరేష్, కండే తిరుపతి, గసిగంటి సాగర్ పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

**కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (సీఐటీయూ) వినతిపత్రం....**



శ్రీరాంపూర్, నేటిధాత్రి: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలను వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (సీఐటీయూ) నాయకులు కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సింగరేణి భరోసా యాత్రలో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్‌పీ--3 ప్రాంతాన్ని సందర్శించిన కేంద్ర మంత్రిని సంఘం ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సంఘం బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు గట్టు మహేందర్,కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2013లో కోల్ ఇండియాలో కుదిరిన ఒప్పందం ప్రకారం దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలవుతున్నప్పటికీ, తెలంగాణలోని సింగరేణి కార్మికులకు మాత్రం ఇప్పటికీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల ఒక్కో కాంట్రాక్టు కార్మికుడు నెలకు సుమారు రూ. 19 వేల వరకు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పించే ఈ వేతనాలను సింగరేణిలో కూడా అమలు చేయాలన్నారు. అలాగే 2013 నుంచి చెల్లించాల్సిన బకాయిలను కూడా కార్మికులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి కాసిపేట రాజేశం,గుజ్జేటి రమేష్,తలారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యామ్నాయ శీర్షికలు:** ▶సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని వినతి... ▶కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి.. కేంద్ర మంత్రికి సీఐటీయూ వినతిపత్రం.. ▶హైపవర్ కమిటీ వేతనాల కోసం సింగరేణి కార్మికుల మరో విజ్ఞప్తి.... ▶30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్....

# 26వ వార్డులో ఓటరు ఎన్యూమరేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో ఉమారాణి



నర్సంపేట, నేటిధాత్రి: నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో 148, 149 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆర్డీవో ఉమారాణి, 26వ వార్డు కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఉమారాణి మాట్లాడుతూ, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. 148, 149 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో ఓటరు సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. వార్డులోని ప్రజలకు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన దరఖాస్తు ఫారాలను క్షేత్రస్థాయిలోనే నింపించి ప్రజలకు పూర్తి సహకారం అందించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఓటరు జాబితాలో పేరు లేని వారు, చిరునామా మార్పు లేదా ఇతర వివరాల్లో సవరణలు అవసరమైన వారు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యూసుఫ్, బీఎల్‌వో ఎన్. అనురాధ, ఏ. చైతన్య, బీఎల్ఏలు సంఘపు శ్రీధర్, గుండెబోయిన శివకోటి, అల్లంనేని ప్రకాశ్‌రావుతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు చిన్న మల్లారెడ్డికి ఘన నివాళులు

**పార్థివ దేహాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్....**



పరకాల, నేటిధాత్రి: కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి చందుపట్ల రాఘవరెడ్డి తండ్రి,స్వాతంత్ర్య సమరయోధుడు చందుపట్ల చిన్న మల్లారెడ్డి అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్న మల్లారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండి శ్రీధర్,కొయ్యడ శ్రీనివాస్,సుదమల్ల రమేష్,బొచ్చు సల్మాన్,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఒంటెరు శ్రవణ్ కుమార్తో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బీసీ యాదవ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**శివచరణ్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ సమాజ్ డిమాండ్....**



మంచిర్యాల, నేటిధాత్రి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలు,బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీసీ సమాజ్ తీవ్రంగా ఖండించింది. ఆయనపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీ సమాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..ఒక వృద్ధ మహిళను,

ప్రజాప్రతినిధిని అవమానించేలా మాట్లాడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ముఖ్యమంత్రి విశ్వాసంతో బాధ్యతలు పొందిన బీసీ మహిళను కించపరిచే వ్యాఖ్యలు చేయడం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. జక్కిడి శివచరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తొలగించి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ పార్టీ బీసీల మనోభావాలను దెబ్బతీసే శక్తులకు మద్దతుగా నిలుస్తోందనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# రా రైస్ టార్గెట్ ఇవ్వాలి..


**ఉమ్మడి వరంగల్ రైస్ మిల్లర్ల డిమాండ్**



వరంగల్, నేటిధాత్రి

గత నాలుగు నెలలుగా రా రైస్ టార్గెట్ కేటాయించకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లులు మూతపడే పరిస్థితి నెలకొన్నట్లు రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. వరంగల్‌లో మంగళవారం జరిగిన ఉమ్మడి జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానా లు చేశారు. సివిల్ సప్లైస్ శాఖ ద్వారా వెంటనే రా రైస్ టార్గెట్ కేటాయించాలని, ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించిన గడువును మరో విడత పొడిగించాలని ప్రభుత్వాన్ని మిల్లర్లు కోరారు. ఎఫ్‌సీఐలో తీవ్రంగా ఉన్న గోదాముల కొరత సమస్యపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రబీ 2025-26 సీజన్‌కు కేవలం 70 శాతం బాయిల్డ్ రైస్ టార్గెట్ మాత్రమే కేటాయించడం పట్ల మిల్లర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన బ్యాలెన్స్ టార్గెట్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ధాన్యానికి కూడా బాయిల్డ్ రైస్ టార్గెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే రాష్ట్ర స్థాయి బాడీతో ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ తెగతెంపులు చేసుకున్నట్లు ప్రకటించారు. ఇకపై వరంగల్ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రభుత్వంతో నేరుగా అనుసంధానంగా పనిచేస్తుందని సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తోట సంపత్ కుమార్ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, దేవునూరి అంజయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు... ఉమ్మడి వరంగల్ జిల్లా రైస్ మిల్లర్ అధ్యక్షులు పాల్గొన్నారు...

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మోడల్ స్కూల్, విద్యార్థుల ఎంపిక.



చిట్యాల, నేటిధాత్రి: మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు టి.జి. మోడల్ స్కూల్, చిట్యాల విద్యార్థులు రన్నింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు,అండర్-14: కె. వీరేంద్ర చారి (6వ తరగతి )-- 60 మీటర్ల పరుగుపందెంఅండర్-16: బి. భార్గవ్ తేజ(9వ తరగతి ) -- 2000 మీటర్ల పరుగుపందెం,అండర్-18: ఎస్. శ్రీశేష(ఇంటర్ రెండవ సంవత్సరం) -- 2000 మీటర్ల పరుగుపందెం,అండర్-18: డి. ప్రణయ్(ఇంటర్ రెండవ సంవత్సరం)-- 2000 మీటర్ల పరుగుపందెం,అండర్-20: యు. అశోక్ (పిడి)-- 1600 మీటర్ల పరుగుపందెంఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రమేష్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విద్యార్థుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన శారీరక విద్య ఉపాధ్యాయులను మరియు తల్లిదండ్రులను అభినందించారు. మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా వారు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం...!!

**ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు -- భిక్ష కాదు!విద్యార్థి లోకానికి అండగా ఏబీవీపీ పోరాటం.....రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై విద్యార్థి నేతల ధ్వజం.....**



కేసముద్రం, నేటిధాత్రి: ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ ( ఏ బి వి పీ) కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండలవ్యాప్త పాలిటెక్నిక్, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల బంద్ సంపూర్ణంగా విజయవంతం అయిందని. ఈ సందర్భంగా ఏబీవీపీ మండల నాయకులు నునవత్ గణేష్, చిత్తరి చాణక్య, బానోత్ సురేందర్, ధరవత్ నవీన్ సంయుక్తంగా మాట్లాడారు. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అవి ప్రభుత్వం పెట్టే భిక్ష కాదని వారు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా (2023-2026), విద్యార్థుల ఫీజుల సమస్యలపై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం అత్యంత విచారకరమన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, దీనిని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తోందని నాయకులు హెచ్చరించారు. ఫీజులు అందక వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ఏబీవీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు.

**ప్రధాన డిమాండ్లు:** బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాయకుండా, ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని. ఈ బంద్ కార్యక్రమంలో మండలంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# ఎస్ఐఆర్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత



జగిత్యాల, నేటిధాత్రి: జగిత్యాల జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ -- ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియ అమలును మంగళవారం రాయికల్ పట్టణంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్. లత పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టి, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కదరఖాస్తుదారులకు తగిన సహాయం అందించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో రాయికల్ తహసీల్దార్ నాగార్జున , ఎన్నికల విభాగం, బి.ఎల్.వో లు రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాలి

**కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ఐఎన్‌టీయూసీ వినతి.. సానుకూలంగా స్పందించిన మంత్రి....**



శ్రీరాంపూర్, నేటిధాత్రి: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌యూ) హోదా కల్పించాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.జనక్ ప్రసాద్ నాయకత్వంలోని ప్రతినిధి బృందం కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కోరారు. సింగరేణి భరోసా యాత్రలో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ అతిథి గృహంలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఇటీవల సింగరేణికి తాడిచెర్ల--2 బొగ్గు గనిని కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి,ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఐఎన్‌టీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించడం వల్ల కలిగే ప్రయోజనాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ హోదా లభిస్తే భూసేకరణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు చట్టపరమైన, పర్యావరణ అనుమతులు త్వరగా లభిస్తాయని,కొత్త బొగ్గు గనుల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అలాగే దేశ ఇంధన భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఐఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి,ఉపాధ్యక్షులు శ్యామ్,దాస్,సదానందం,ప్రధాన కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్,గనుల సిబ్బంది ఇన్‌చార్జి తిరుపతి రాజు,ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుపై సమర శంఖం పూరించాలి.. కాంగ్రెస్ అంటేనే మోసం

**'యువ సంగ్రామ సదస్సు'కు యువత భారీగా తరలిరావాలి....బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపు....కుత్బుల్లాపూర్‌లో ఘనంగా సన్నాహక సమావేశం...**



**కుత్బుల్లాపూర్, నేటిధాత్రి:** "కాంగ్రెస్ అంటేనే మోసం -- మోసం అంటేనే కాంగ్రెస్" అని, అబద్ధపు హామీలతో నిరుద్యోగ యువతను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు తెలంగాణ యువత సిద్ధం కావాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు..




ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సదస్సు" విజయవంతం కోసం మంగళవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై, సభ విజయవంతానికి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 2023 జూలై 18న ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి యువత ఆశలను వమ్ము చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో



మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువత పేరిట 13 డిక్లరేషన్లు ప్రకటించి, అధికారం లోకి వచ్చాక ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. చివరకు ప్రాజెక్టుల్లో నీరున్నా రైతులకు సాగునీరు విడుదల చేయకుండా పంటలు ఎండబెడుతున్నారని ఆరోపించారు. హక్కుల కోసం ప్రజలు, ప్రతిపక్షాలు, ఆటో కార్మికులు, విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తే కేసులు, బెదిరింపులతో భయపెట్టే ధోరణి అవలిస్తున్నారని మండిపడ్డారు. హామీలను నిరంతరం గుర్తు చేస్తూ బీఆర్ఎస్ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తుందని, ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే యువ సంగ్రామ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుండి యువత, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, యువజన, విద్యార్థి, మహిళా విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణపురం పిఎసిఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ జిల్లా కలెక్టర్



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం గణపురం మండలంలోని పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని స్టాక్ బోర్డును పరిశీలించిన కలెక్టర్, అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియా సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, యూరియా యాప్ ద్వారా బుక్ చేసుకోవడంపై అవగాహన ఉందా అని అడిగి తెలుసుకున్నారు. యూరియా కు ప్రత్యామ్నయంగా నానో యూరియాను వినియోగించాలని రైతులకు సూచించారు. గత ఏడాది జూలై 14వ తేదీ నాటికి ఎంత యూరియా కేటాయించారు, వినియోగం ఎంత జరిగిందో నివేదికలు సమర్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు, పశు సంవర్ధక శాఖ డిడి డా కుమారస్వామి, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్ మండల వ్యవసాయ అధికారి దేశినేని ఐలయ్య సీఈఓ పుట్ట సురేష్ ఏ ఈ ఓ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



**గౌడ, యాదవ సమాజాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి...**

**మహబూబాబాద్, నేటిధాత్రి:** గౌడ సమాజం,యాదవ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని గౌడ, యాదవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో గౌడ సంఘాలు, యాదవ సంఘాలు, బహుజన రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే నేషనల్ అవార్డు గ్రహీత, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు, బీసీ--ఎస్సీ--ఎస్టీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సమాజాన్ని అవమానించేలా, యాదవ సమాజానికి చెందిన ఈశ్వరమ్మపై కూడా అనుచిత పదజాలంతో మాట్లాడటం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవని పేర్కొంటూ, సంబంధిత నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ వర్గాల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అలాగే గౌడ, యాదవ సమాజాలకు, ఈశ్వరమ్మకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల వెంకన్న గౌడ్, యాదవ నాయకుడు చిత్తరి సోమన్న యాదవ్, మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి గడ్డం అగర్వాల్ గౌడ్, యాదవ సంఘం జిల్లా కార్యదర్శి మల్లయ్య యాదవ్, తెలంగాణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకన్న గౌడ్, బహుజన రాజ్యాధికార సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గండి వీరేందర్ గౌడ్‌తో పాటు గౌడ, యాదవ, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేపలను చంపడం దుర్మార్గపు చర్య



**ముదిరాజ్ ల నోటికాడి కూడు లాగేసుకున్నారు..... నడికూడ గ్రామ ముదిరాజ్ సంఘం చైర్మన్ తాళ్ళ శ్యామ్ రాజ్....**



**నడికూడ, నేటిధాత్రి:** మండల కేంద్రంలోని తిమ్మాయికుంట చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు విషపు మందు పోయడంతో చెరువులోని చేపలు చనిపోవడంతో సుమారుగా లక్ష రూపాయలు నష్టపోయామని నడికూడ గ్రామ ముదిరాజ్ సంఘం చైర్మన్ తాళ్ళ శ్యామ్ రాజ్ తెలియజేశారు. వారు మాట్లాడుతూ చేపల వ్యాపారవే ముదిరాజ్ కులస్తులకు జీవనోపాధి అని చేపలను చంపడం దుర్మార్గపు చర్య అని చేప పిల్లలపై మీ ప్రతాపం చూపిస్తారా అని చేప పిల్లలు మీకు ఏం అన్యాయం చేశాయని చంపారని ముదిరాజ్ కులస్తుల నోటికాడి కూడు లాగేసుకున్నారని మండిపడ్డారు. రాత్రి,పగలు అని తేడా లేకుండా చెరువులోని చేపలను కాపాడుకుంటూ వస్తున్నామని,ఇంతటి దుర్మార్గం పనిచేసిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ కులస్తులకు న్యాయం చేయాలని కోరుతున్నానని తెలిపారు.

# సీఎంను కలిసేందుకు వెళ్తున్న మాజీ సర్పంచుల అరెస్టు



**దుగ్గొండి, నేటిధాత్రి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు హైదరాబాద్‌లో సీఎంను కలిసేందుకు వెళ్తున్న మాజీ సర్పంచులను రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ నాయకులు తెలిపారు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట మాజీ సర్పంచ్, మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం విద్యాసాగర్, గోపాలపురం మాజీ సర్పంచ్ నీలం పైడయ్య, తొగర్రాయి మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతి రెడ్డిలను పోలీసులు వారి నివాసాల వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోడెం విద్యాసాగర్ మాట్లాడుతూ, మాజీ సర్పంచులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం ఏం సాధిస్తుందని ప్రశ్నించారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి, మాజీ సర్పంచులకు రావాల్సిన బకాయిల చెల్లింపునకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, నేటిధాత్రి:** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలోని రైతు వేదికలో 'రైతు నేస్తం' కార్యక్రమం మరియు కంటిన్జెన్సీ ప్లాన్ (ఆకస్మిక ప్రణాళిక) సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామడుగు మండల వ్యవసాయ అధికారి ప్రభావతి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. భారత వాతావరణ శాఖ వారి సూచన ప్రకారం రాబోయే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షాలు లేవని తద్వార భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని కావున నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పప్పు ధాన్య పంటలు కంది, పెసర, మినుము పంటలను వచ్చే ఆగస్ట వరకు విత్తుకొని సాగుచేసుకోవాలని తెలిపారు. నూనెగింజలలో నువ్వులు మరియు చిరుధాన్యాలైన జొన్నలు, సజ్జలకు నీటి వినియోగం తక్కువ ఉంటుందని, వీటి సాగుకు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. నీటిని వృధా చేయకుండా నీటి యాజమాన్య పద్ధతులు పాటించి లభ్యత ఉన్న నీటిని సమర్థవంతంగా వాడుకోవాలని సూచించారు. బోరు బావుల కింద వరి నాట్లు వేయక పోవడం మంచిదని లేని యెడల భూగర్భ జలాలు తగ్గి పంట మధ్యలో నీటి ఎద్దడి ఎక్కువై పంట ఎండిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈసమావేశంలో గ్రామ సర్పంచ్ ఎడవెల్లి వనజ-నరేందర్ రెడ్డి, ఏఈఓ అనంతరాజ్, క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో స్థానం సంపాదిస్తూ... సేవతో ముందుకు సాగుతున్న భూక్య జంపన్న

**30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం.44 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక.**



**ములుగు, నేటిధాత్రి:** ప్రజాసేవనే పరమావధిగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించిన 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగినింది. శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు, వృద్ధులకు నిపుణులైన వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స అవసరమైన 44 మందిని గుర్తించి, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సు ద్వారా తరలించారు. గత రెండున్నర సంవత్సరాలుగా ములుగు జిల్లాలోని గ్రామాల వారీగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మంది నిరుపేదలకు చూపును అందించే సేవా కార్యక్రమాలను భూక్య జంపన్న నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ఆయన చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, "పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. నేను చేస్తున్న సేవను చూసి కొందరు తప్పుడు ప్రచారం చేసినా వాటిని ఏమాత్రం పట్టించుకోను. ప్రజలే నాకు బలం, వారి ఆశీస్సులే నా ఆస్తి. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తాను" అని అన్నారు. అలాగే త్వరలో ములుగు జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు వెళ్లి ప్రజల ఆశీర్వాదం కోరనున్నట్లు తెలిపారు. "మీ ఇంటికి మీ ఆశీర్వాదం కోసం వస్తాను. మీ ప్రేమ, మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాకు ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. శిబిరం ద్వారా లబ్ధి పొందిన వృద్ధులు, పేద కుటుంబాలు మాట్లాడుతూ, కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమకు భూక్య జంపన్న ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలిచారని తెలిపారు. తమ జీవితాల్లో మళ్లీ వెలుగులు నింపిన ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ప్రజాసేవను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆశీర్వదించారు. ప్రజాసేవనే రాజకీయానికి పునాదిగా చేసుకుని ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న భూక్య జంపన్న సేవలు ములుగు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వెంకటాపూర్ మాజీ మండల అధ్యక్షులు లింగాల రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ సాదా యాదగిరి, చంటి భద్రయ్య , బాదావత్ రాజ్ కుమార్ , పోషల్ల వీరమల్లు, నల్ల భద్రయ్య , నరెట్ల విజయేందర్ , నూనె రమేష్ , సోమిడి రవి , చిక్కుల కళ్యాణి గారు, జహీర్ పాషా గారు, చిగురు దేవేందర్, తోట సంపత్ గారు, తదితరులు పాల్గొన్నారు..

# గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వంమే భరించాలి- మేకల ప్రభాకర్ యాదవ్



**రామడుగు, నేటిధాత్రి:** భారతీయ జనతా పార్టీ రామడుగు మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు నిధులు మేమే ఇస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటు, గ్రామ పంచాయితీలను రాష్ట్ర ప్రభుత్వాలే నడిపిస్తున్నాయని గత ప్రభుత్వం, ఇప్పుడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతూ గ్రామాలలో ఉన్నటువంటి వీధి దీపాల మరియు నల్ల విద్యుత్ బిల్లులను గ్రామ పంచాయితీలనే కట్టమనడం విడ్డురంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. గ్రామ పంచాయితీలో పెండింగ్ ఉన్నటువంటి కరెంట్ బిల్లులను గ్రామ పంచాయితీ నుండే కట్టాలని అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించడం పట్ల వారు మండిపడ్డారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్నటువంటి పెండింగ్ విద్యుత్ బిల్లులు సుమారు ఆరు కోట్ల రూపాయలను ప్రభుత్వమే చెల్లించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టినటువంటి ప్రజా పాలనకి కూడా ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో రైతులు సాగు నీరు లేక ఇబ్బంది పడుతున్నారని వెంటనే సాగు నీరుని విడుదల చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా చేయాలని స్థానిక ఎమ్మెల్యేని వారు కోరారు. లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్, సర్పంచ్ దయ్యాల లత వీరమల్లు, ఉప సర్పంచ్ లు వేముండ్ల కుమార్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బద్ధం లక్ష్మారెడ్డి, దళిత మోర్చా మండల అధ్యక్షులు సంటి జితేందర్, యువ మోర్చా మండల అధ్యక్షులు దయ్యాల రాజు, నాయకులు పురేళ్ల రాజశేఖర్, వేముల రమేష్, లంక నర్సింగం, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు ఇన్కమ్ టాక్స్ మాఫీ, 250 గజాల స్థలం ఇవ్వాలి

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సత్యనారాయణ వినతి....**



**మొగులపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా ఖుఖ-8 ఇంక్లైన్ బొగ్గు గనిని సందర్శించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు శ్రీ జి. కిషన్ రెడ్డి గారికి బీసీ నాయకులు, సామాజిక కార్యకర్త భీమనాధుని సత్యనారాయణ గారు సింగరేణి కార్మికుల సమస్యలు, జిల్లా అభివృద్ధి అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి పరిధిలోని తాడిచెర్ల బ్లాక్-2 ను కేటాయించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. సింగరేణి కార్మికుల జీతాలపై విధిస్తున్న ఇన్కమ్ టాక్స్ ను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. కార్మికుల ఆర్థిక భారం తగ్గేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా ప్రతి కార్మికుడికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించి సొంత ఇంటి పథకాన్ని కేంద్రం ద్వారా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల వేతనాలు పెంచేందుకు 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా కార్మికుల జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న భూపాలపల్లిలో బొగ్గు అథారిటీ ఆధ్వర్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీ పన్నును మాఫీ చేయాలని కోరారు. అలాగే రామగుండం నుండి భూపాలపల్లి మీదుగా మణుగూరుకు మంజూరైన నూతన రైలు మార్గానికి వెంటనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రైలు మార్గం వల్ల 100 గ్రామాల ప్రజలకు రైల్వే ప్రయాణ సౌకర్యం, బొగ్గు రవాణాకు సదుపాయం కలుగుతుందని వివరించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారు అన్ని అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారని సత్యనారాయణ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సింగరేణి కార్మికులు, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా విద్యాశాఖ అధికారి యం. రాజేందర్...**

**భూపాలపల్లి, నేటిధాత్రి:** జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుండి 2026-27 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఢిల్లీ వారు ఆహ్వానిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్ తెలిపారు. nationalawardstoteachers.education.gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తులను జులై- 20వ తేది లోగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఫైనల్ సబ్మిట్ చేయాలనీ తెలిపారు. ఈ అవకాశాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోగలరని యం. రాజేందర్ తెలిపారు.

# నేటిధాత్రి 9 NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

## "నేటిధాత్రి" పత్రికను ఆదరించిన విధంగానే "నేటిధాత్రి 9" " యూట్యూబ్ ఛానల్ " కూడా ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# రోజూ ఖర్జూరం తింటే జరిగేదేంటి?

ఖర్జూరాన్ని సహజంగా డ్రై ఫ్రూట్స్ లో భాగంగా తీసుకుంటారు. తీపి రుచిని కలిగిన కారణంగా దీన్ని తినడానికి అందరూ ఇష్టపడతారు. వీటిలో పోషకాలు, ఫైబర్, విటమిన్లు పుష్కలంగా ఉన్న కారణంగా బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుస్తాయి. అయితే ఖర్జూరాలను అప్పుడప్పుడు తినడమే తప్ప రోజూ తినేవారు తక్కువగానే ఉంటారు. ప్రతిరోజూ ఖర్జూరాలను తినడం వల్ల కింది ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.



### పోషకాలకు పవర్ హౌస్..

ఖర్జూరాలలో విటమిన్-బి, కె సమృద్ధిగా ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం, రాగి వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఫైబర్‌తో సహా బోలెడు పోషకాలు ఇందులో ఉంటాయి. ఖర్జూరాలను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి కావలసిన పోషకాలను సులువుగా భర్తీ చేయవచ్చు.

### ఎనర్జీ బూస్టర్..

ఖర్జూరాలు గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లతో సహా వివిధ చక్కెరలతో నిండి ఉంటాయి. ఇవి తక్షణ శక్తిని ఇస్తాయి. పగటిపూట తక్షణ శక్తి అవసరమయ్యే వ్యక్తులకు ప్రాసెస్ చేయబడిన ఆహారాలకంటే ఖర్జూరాలు ది బెస్ట్ ఎంపిక. ఖర్జూరాలలోని సహజ చక్కెరలు ఫైబర్‌తో కలిసి ఉంటాయి, ఇది చక్కెర గ్రహించే సామర్థ్యాన్ని నియంత్రిస్తుంది. శరీరంలో అకస్మాత్తుగా చక్కెర స్థాయి పెరగడం, తగ్గడం జరగదు.

### ఎముకల ఆరోగ్యం..

ఖర్జూరంలో భాస్వరం, మెగ్నీషియం, కాల్షియం ఉంటాయి, ఇవన్నీ ఎముకల ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. ఖర్జూరాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బలమైన, ఆరోగ్యకరమైన ఎముకలు ఏర్పడటమే కాకుండా బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది..

ఫైబర్ కంటెంట్ మెరుగ్గా ఉన్న కారణంగా జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ప్రేగు కదలికలను చురుగ్గా ఉంచడం ద్వారా మలబద్ధకాన్ని నివారించడంలోనూ, ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోటాకు మద్దతు ఇవ్వడంలోనూ సహాయపడుతుంది. వీటిని రోజూ తింటే పోషకాల గ్రహించే సామర్థ్యం పెరుగుతుంది. శరీరంలో వ్యర్థాలు తొలగిస్తుంది.

### యాంటీఆక్సిడెంట్ పవర్‌హౌస్..

శరీర కణాలకు నష్టం చేకూర్చే ఫ్రీ రాడికల్స్ తో పోరాడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఖర్జూరంలో ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్, అల్జీమర్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

### గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది..

ఖర్జూరాలలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఈ కారణంగా రక్తపోటును నియంత్రించడంలో ఇవి సహాయపడతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పొటాషియం రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచి రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

కృత్రిమ చక్కెరలకు ప్రత్యామ్నాయం..

సహజ చక్కెరలు కలిగి ఉన్న కారణంగా ఖర్జూరాలు శుద్ధి చేసిన చక్కెరలకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయి. ఖర్జూరంలోని సహజ చక్కెరలు ఫైబర్‌తో కలిసి ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా నియంత్రిస్తాయి. కృత్రిమ చక్కెరలకు బదులుగా వివిధ తీపి ఆహారాల తయారీలో ఖర్జూరాలను ఉపయోగించవచ్చు.

(గమనిక: ఇది ఆరోగ్య నిపుణులు, వైద్యులు పలుచోట్ల పేర్కొన్న అంశాల ఆధారంగా రూపొందించబడిన కథనం. ఆరోగ్యం గురించి ఏవైనా సందేహాలుంటే వైద్యులను సంప్రదించడంల మంచిది.


# 2024లో అత్యుత్తమ ఆహారం ఇదే..!



గ్రీస్, ఇటలీ, క్రొయేషియా, టర్కీ, స్పెయిన్, మొరాకో సహా మధ్యతరహా ప్రాంత వాసులు అనుసరించే ఆహార పద్ధతులు ఎంతో ఆరోగ్యకరంగా, పోషకాల గనిగా రుచికరంగా ఉంటాయనే పేరుంది. అందుకే వరుసగా ఏడోసారి మధ్యధరా తరహా ఆహారం 2024లో అత్యంత ఆరోగ్యకరమైన ఆహారంగా నిపుణుల ప్యానెల్ ఏడో సారి ఎంపిక చేసిందని యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్ వెల్లడించింది.

మధ్యధరా ప్రాంతంలో భిన్న ఆహారాలను ప్రజలు తీసుకుంటుండగా ప్రధానంగా హెూల్ గ్రెయిన్స్, బీన్స్, నట్స్, ఎక్స్ట్రా వర్జిన్ ఆయిల్ నుంచి చేసే అసంతృప్త కొవ్వులు, సీఫడ్ వంటి ఆహారాన్ని అధికంగా తీసుకుంటారు. మొక్కల ఆధారిత ఆహారాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. మధ్యధరా తరహా ఆహారంతో హృద్రోగ ముప్పు, టైప్ 2 మధుమేహ ముప్పు తగ్గి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి దీర్ఘాయువు సాధ్యమవుతుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. మధ్యధరా తరహా ఆహారంలో ప్లేట్‌లో పలు రకాల ఆహార పదార్థాలను వడ్డించి ఆరగిస్తారు. వారానికి రెండుసార్లు సీఫుడ్ తీసుకుంటారు. పౌల్ట్రీ, ఎగ్స్, వెన్న, యోగర్ట్ మితంగా తీసుకుంటారు. రెడ్ మీట్, స్వీట్లు అరుదుగా తింటారు. అప్పుడప్పుడూ రెడ్ వైన్ తీసుకుంటారు. సోడియం, షుగర్, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలను బాగా తగ్గించి పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకర కొవ్వులను అధికంగా తీసుకుంటారు.

# వాకింగ్ చేస్తున్నారా ..
# ఈ 5 తప్పులు చేయకండి..!



వాకింగ్ చాలా సులువుగా ఎవరైనా చేయగలిగే వ్యాయామం. దీన్ని కార్డియో వ్యాయామాలలో ఒకటిగా పరిగణిస్తారు. దీర్ఘకాలం వాకింగ్ చేసేవారిలో అధిక బరువు, రక్తపోటు నియంత్రణలో ఉంటాయి. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. కానీ చాలామందికి వాకింగ్ రూల్స్ తెలియవు. నడుస్తున్నాం కదా.. ఆరోగ్యంగా ఉంటాంలే అనే అపోహలో ఉంటారు. కానీ వాకింగ్ చేసే చాలామందికి తెలియని విషయాలున్నాయి. తమకు తెలియకుండానే 5 పొరపాట్లు చేస్తుంటారు. వీటి కారణంగా చాలా నష్టాలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇంతకీ వాకింగ్ చేసేటప్పుడు చేయకూడని పొరపాట్లేమిటో తెలుసుకుంటే..

### నడిచే స్థలం.. సమయం

వాకింగ్ కు మంచి స్థలం, సమయం ముఖ్యం. పార్క్ లు, ఇంటి బయట తోట, పచ్చని వాతావరణం, సహజ కాంతి ఉండే ప్రదేశాలలో వాకింగ్ చెయ్యాలి. నగరాల్లో నివసించేవారు సూర్యుడు ఉదయించాక వాకింగ్ చేయడం మంచిది. 7గంటల లోపు వాతావరణంలో కాలుష్యం స్థాయిలు ఎక్కువ ఉంటాయట.

### సౌకర్యం

వాకింగ్ షూస్, దుస్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. బరువు లేని షూస్, నడవడానికి సౌకర్యవంతమైన దుస్తులు ఎంపిక చేసుకోవాలి. కాళ్లకు సపోర్ట్ గా, అరికాళ్లు వంగడానికి సౌకర్యవంతంగా ఉన్న షూస్ ఎంచుకోవాలి.

### వాకింగ్ ముందు.. తరువాత..

నేరుగా వాకింగ్ కు వెళ్లకూడదు. నడకకు 15-20 నిమిషాల ముందు నీరు త్రాగాలి. నడుస్తూ నీళ్లు తాగకూడదు. దీనివల్ల శరీరంలో నీరు, లవణాల బ్యాలెన్స్ తప్పుతుంది. నడకకు ముందు వార్మప్, నడిచిన తరువాత వార్మౌట్ కావాలి. శరీరాన్ని రిలాక్స్ చేసుకోవాలి. దీనివల్ల కండరాల నొప్పులు, ఎముకల సమస్యలు నివారించవచ్చు.

### ఎలా నడవాలంటే..

సరైన భంగిమలో నడవకపోతే మోకాళ్లు, చీలమండల నొప్పులు సులభంగా వస్తాయి. వెన్ను నిటారుగా, గడ్డంపైకి లేపి స్ట్రైట్ గా నడవాలి. భుజాలు వంచి ఎప్పుడూ నడవకూడదు. ఇలా చేస్తే ఊపిరితిత్తులలో గాలి ప్రవాహం మందగిస్తుంది. ఇది వాకింగ్ చేసేటప్పుడు తొందరగా అలసిపోయేలా చేస్తుంది.

### వేగం

వేగంగా వాకింగ్ చేసేటప్పుడు చిన్నచిన్న అంగలు వేస్తూ వేగంగా నడవాలి. అదే మెల్లిగా వాకింగ్ చేసేటప్పుడు పెద్ద అంగలు వేస్తూ నడిచినా ఏమీ కాదు. లేకపోతే మోకాళ్ల మీద ప్రభావం పడి సమస్యలు వస్తాయి.

(గమనిక: ఇది ఫిట్నెస్ నిపుణులు, వైద్యులు పలుచోట్ల పేర్కొన్న కథనాల ఆధారంగా రూపొందించబడిన కథనం. ఆరోగ్య సమస్యలేమైనా ఉంటే వైద్యులను సంప్రదించడం మంచిది





# సెలబ్రిటీలు ఫాలో అయ్యే ట్రిక్ ఇది

## భోజనం తరువాత ఈ ఒక్క పని చేస్తే..!

సెల్రిటీలను చూసినప్పుడల్లా వారి శరీర సౌష్టవం విషయంలో ఆశ్చర్యపోతుంటాం. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో ఇది మరికాస్త ఎక్కువగానే ఉంటుంది. అసలు వారు ఏమైనా తింటారా? లేదా? అలా సన్నగా నాజూగ్గా ఎలా ఉంటారో అనే సందేహం కూడా వస్తుంది. సెలబ్రిటీలు కూడా తమకు ఇష్టమైన ఆహారాన్ని ఆస్వాదిస్తారు. కానీ తమ శరీరంలో కొవ్వు పెరగకుండా ఉండటానికి, ఆహారం జీర్ణం కావడానికి, ఇతర ఉదర సంబంధ సమస్యలు రాకుండా ఉండటానికి ఫిట్ నెస్ ట్రైనర్ సహాయం తీసుకుంటారు. అలియా భట్, కరీనా కపూర్, దీపికా పదుకొణె, అనన్య పాండే మొదలైన బాలీవుడ్ భామలకు ఫిట్ నెస్ ట్రైనర్ గా పనిచేసిన అన్షుక పర్వాణి ఓ ట్రిక్ షేర్ చేశారు. దీని గురించి పూర్తిగా తెలుసుకుంటే..

సెలబ్రిటీలు తమ శరీర సౌష్టవం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఒళ్లు పెరగకుండా ఉండటానికి ఫిట్నెస్ ట్రైనర్ల సహాయంతో ఎప్పటిప్పుడు కేలరీలను బర్న్ చేస్తుంటారు. ప్రముఖ సెలబ్రిటీలకు ఫిట్నెస్ ట్రైనర్ గా పనిచేసిన అన్షుక పర్వాణి భోజనం తరువాత చేసే అద్భుతమైన యోగా ఆసనం గురించి ఇన్స్టాగ్రామ్ లో వివరించారు. బోజనం తరువాత వజ్రాసనం వేయడం వల్ల మంచి ఫలితాలుంటాయని అంటున్నారు.

మోకాళ్ళ మీద కూర్చుని పాదాల మడమల మీద పిరుదులు ఆనించి కూర్చోవడాన్ని వజ్రాసనం అని అంటారు. ఈ భంగిమలో కూర్చోవడం వల్ల తిన్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. ప్రేగు ఆరోగ్యం బాగుంటుంది. అదే విధంగా మహిళలలో ఋతుచక్రం, మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉండటానికి ఈ ఆసనం సహాయపడుతుంది. భోజనం చేసిన తరువాత ఈ ఆసనం ఫాలో అయితే పై ప్రయోజనాలు చేకూరతాయి. కేవలం వజ్రాసనం మాత్రమే కాకుండా వజ్రాసనంలో కూర్చున్నప్పుడు పోషణ ముద్ర వెయడం వల్ల మరిన్ని లాభాలుంటాయి. ఈ ముద్ర వేయడానికి కుడి చేతి బొటనవేలు, చూపుడు వేలు, మధ్యవేలు మూడింటిని కలిపి ఉంచాలి. ఎడమ చేతి బొటన వేలు, మధ్యవేలు, ఉంగరపు వేలు మూడింటిని కలిపి ఉంచాలి. చలికాలంలో ఆహారం చాలా నెమ్మదిగా ఉంటుంది. వజ్రాసనంలో కూర్చుని ఈ ముద్రలు ప్రాక్టీస్ చేస్తే ఆహారం బాగా జీర్ణమవుతుంది. దీన్ని 3 నిమిషాలతో మొదలుపెట్టి 15 నిమిషాల వరకు ఎంతసేపు అయినా వేయవచ్చు.

# చలికాలంలో జ్యూసులు తాగడం మంచిదేనా? ఆయుర్వేదం ఏం చెబుతోందంటే..!

చలికాలంలో కనీసం మంచినీళ్లు కూడా ఎక్కువగా తాగబుద్దేయదు. వెచ్చని వాతావరణంలో ఉండాలని, వెచ్చని ఆహారాలు తీసుకోవాలని కోరుకుంటారు. కానీ ఆరోగ్య స్పృహ ఉన్నవారు మాత్రం సీజన్ తో సంబంధం లేకుండా పచ్చి కూరగాయలు, జ్యూసులు తాగుతారు. ఇది ఆరోగ్యానికి మంచిదేనా అంటే కాదని చెబుతోంది ఆయుర్వేదం. చలికాలంలో జ్యూసులు ఎందుకు తాగకూడదు? ఆరోగ్యం కోసం ఏ జ్యూసులు తాగితే మంచిది? ఆయుర్వేదం ఏం చెబుతోంది? పూర్తిగా తెలుసుకుంటే..

ఆయుర్వేదం ప్రకారం చలికాలంలో జీర్ణవ్యవస్థ బలహీనపడుతుంది. జ్యూస్ తాగడం వల్ల అలసట, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. జ్యూసులలో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉన్నా సరే.. ఏవి పడితే అవి తాగకూడదు. చలికాలానికి మాత్రమే నిర్ధేశించిన జ్యూసులను తీసుకోవడం మంచిది. జ్యూసులలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో చక్కెర నిల్వలు పేరుకుపోయేలా చేస్తుంది. చాపకింద నీరులా బరువు పెరగడానికి కూడా కారణం అవుతుంది. అందుకే చలికాలంలో ఎక్కువగా జ్యూసులు తాగకూడదు. పైగా ఇవి కూలింగ్ ఎఫెక్ట్ ఇస్తాయి. వీటిని తాగితే దగ్గు, జలుబు, అజీర్ణం, వాంతులు వంటి సమస్యలొస్తాయి. అందుకే చలికాలంలో కింద పేర్కొన్న జ్యూసులు మాత్రమే మితంగా తాగాలి.

ఆరెంజ్ జ్యూస్..


ఆరెంజ్ జ్యూస్ లో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చలికాలంలో జలుబు, ఫ్లూ వంటి సమస్యలతో పోరడడానికి సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వాపులు తగ్గించడంలోనూ, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలోనూ సహాయపడతాయి.

క్రాన్బెర్రీ జ్యూస్.

క్రాన్బెర్రీ జ్యూస్ దానిమ్మ జ్యూస్ లా ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. ఇది జీర్ణక్రియను పెంచుతుంది. కడుపులో మంట తగ్గిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల శరీరంలో టాక్సిన్లు తొలించడంలో సహాయపడుతుంది. ఇన్ఫెక్షన్ ప్రమాదాల నుండి రక్షిస్తుంది.

ఆపిల్, బీట్ రూట్, క్యారెట్ జ్యూస్ (ఎబిసి)


ఆపిల్, బీట్ రూట్, క్యారెట్ మూడు కలిపి జ్యూస్ చేసుకుని తాగితే ఆరోగ్యానికి బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. ఈ జ్యూస్ లో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఐరన్, మెగ్నీషఇయం, పొటాషియం, ఫోలెట్ వంటి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి.





# బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

## క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం



- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు
- అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు
- 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు
- ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, నేటిధాత్రి:**
ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్‌ను రీడ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు.
సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దేవాదాయ, రహదారులు-భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా, అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తమవుతున్న సంతృప్తి స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు.
ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకు పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా మెరుగైన ఫలితాలు వచ్చేలా నిర్ణయాలు ఉండాలని సూచించారు.
దేవాదాయ శాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, సరైన ప్రణాళికతో వాటిని అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ దేవాలయాల పరిసరాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించేలా, పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం సేకరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి అర్జీదారుడికి తగిన సమాధానం ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాలు మరింత పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్‌బీకేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, యూరియా దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పులు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్లలో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, బస్సులు నిర్ణీత సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ కింద చేర్చి వివాదాల్లోకి నెట్టారని అన్నారు. ఇప్పటివరకు 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు.
శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించడం ద్వారా రైతుల సమస్యలు తీరడమే కాకుండా రూ.900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలను అన్‌లాక్ చేయాలని అధికారులకు సూచించారు.
పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ మార్గాల్లో వచ్చే ప్రతి అర్జీ, ఫిర్యాదును మానవీయ
కోణంలో పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఆర్థిక, ఆర్థికేతర, వ్యక్తిగత, సామాజిక అంశాలకు సంబంధించిన ఫిర్యాదులపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రొటీన్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తే ప్రజల్లో సంతృప్తి పెరుగుతుందని అన్నారు.
గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా, పెరుగుతున్నాయా అనే అంశాన్ని నిరంతరం విశ్లేషించాలని సీఎం సూచించారు. సమస్యలు పరిష్కారమైతే ఫిర్యాదుల సంఖ్య సహజంగానే తగ్గుతుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ రూపొందించిన "గవర్నెన్స్ డట్ నెవర్ స్లీప్స్" మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షలో మంత్రి పార్థసారథి వర్చువల్‌గా పాల్గొనగా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# దేశం చూపు తెలంగాణ వైపు!

## 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తాం : రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





- ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు మంజూరు
- బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు.. భక్తులకు అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ
- అదనపు అభివృద్ధి పనులకు మరో రూ.50-60 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో

జగిత్యాల /ధర్మపురి/ వెల్గటూర్ , నేటిధాత్రి:
2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.
జూన్-2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో వీఐపీ ఘాట్లు, సాధారణ స్నాన ఘాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, బైపాస్ రోడ్లు, రహదారుల విస్తరణ, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
అదేవిధంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, ఉగ్ర నరసింహస్వామి ఆలయం, కోటిలింగాల దేవస్థానం పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులను పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల ప్రణాళికలు, అంచనాలు, కాలపట్టికలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని నాణ్యతతో, వేగంగా పూర్తి చేసేలా తగిన సూచనలు అందించారు. తొలి విడతలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి తెలిపారు.
ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలందరూ భగవంతుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి 2027 గోదావరి పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
జూలై-2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేబినెట్ ఉపసంఘం నిర్ణయం మేరకు బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన దేవాలయాల పునరుద్ధరణతో పాటు పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.
గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లను కేటాయించిందనిఅందులో ధర్మపురి, కోటిలింగాల పుష్కరాల ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తొలి విడతలో రూ.117 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు.
ధర్మపురి అభివృద్ధికి మరిన్ని పనులను ప్రతిపాదిస్తూ అదనంగా రూ.50 నుంచి రూ.60 కోట్ల వరకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇందులో అమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో వంతెన నిర్మాణం ద్వారా సంతోషీమాత ఆలయానికి అనుసంధానం, ప్రత్యేక వీఐపీ ఘాట్ నిర్మాణం, కోటిలింగాల ఆలయం సమీపంలో డబుల్ రోడ్డు నిర్మాణం వంటి కీలక ప్రతిపాదనలు ఉన్నాయని వివరించారు.
క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ధర్మపురి, కోటిలింగాలను సందర్శించారని, అధికారులు నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.
దేశంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా బాసర, కాళేశ్వరం, వేములవాడ, యాదాద్రి, భద్రాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి అనుగ్రహం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.
భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ సంగనభట్ల దినేష్, దేవాలయం ఈవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ లు, పంచాయతీ రాజ్ ఏఈ లు, రోడ్డు భవనాల శాఖ ఏఈ లు, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఈహెచ్‌సీటీపై "తానా" అభ్యంతరాలు

## -సీజీహెచ్‌ఎస్ టారిఫ్‌తో సేవలు అందించలేమని స్పష్టం



హైదరాబాద్, నేటిధాత్రి.
ప్రతిపాదిత ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌సీటీ)ను సవరించిన సీజీహెచ్‌ఎస్ టారిఫ్‌లతో అమలు చేస్తే తమ సభ్య ఆస్పత్రులు సేవలు అందించబోవని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తానా) స్పష్టం చేసింది.
తానా రాష్ట్ర అధ్యక్షుడు డా. వద్దిరాజు రాకేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం ఈహెచ్‌సీటీ సీఈఓ హనుమంతుతో సమావేశమై తమ అభ్యంతరాలను, డిమాండ్లను వివరించింది. ప్రతిపాదిత ప్యాకేజీ రేట్లు ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ, పాత ఈహెచ్‌ఎస్ ప్యాకేజీల కంటే తక్కువగా ఉండటంతో ఆస్పత్రులు వాటిని అమలు చేయడం సాధ్యం కాదని పేర్కొంది.
చికిత్స ప్యాకేజీలను శాస్త్రీయ విధానంలో పునర్నిర్ణయించాలని, పాలక మండలి సహా కీలక కమిటీల్లో నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులకు చోటు కల్పించాలని, పారదర్శక ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పాత ఈహెచ్‌ఎస్ బకాయిలను వెంటనే చెల్లించాలని సంఘం కోరింది. ఈ అంశాలపై సమావేశంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదని తెలిపింది.
రాష్ట్ర ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద 70 నుంచి 80 శాతం వైద్య సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులే అందిస్తున్నాయని తానా పేర్కొంది. కొత్త పథకాన్ని అమలు చేసే ముందు ప్రభుత్వం, ఉద్యోగ సంఘాలు, సంబంధిత వర్గాలు తమతో సమగ్రంగా చర్చించి ఆచరణ సాధ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.
గత రెండు నెలలుగా ఈ అంశాలను ఈహెచ్‌సీటీ సీఈఓతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని,
ఉన్నతాధికారులను కలిసేందుకు కూడా అవకాశం కల్పించలేదని తానా అసంతృప్తి వ్యక్తం చేసింది. సమస్యలను పరిష్కరించకుండా కొత్త పథకాన్ని అమలు చేస్తే పాత ఈహెచ్‌ఎస్‌లో ఎదురైన లోపాలే మళ్లీ పునరావృతమయ్యే ప్రమాదం ఉందని, దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యం దెబ్బతింటుందని హెచ్చరించింది.

# ఓటు హక్కు కోల్పోవద్దు.. పది రోజులే గడువు!

## ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే పూర్తి చేయండి: తహసీల్దార్ సునీత



మొగుళ్లపల్లి, నేటిధాత్రి:
మండలంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈ నెల 24వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ సునీత పిలుపునిచ్చారు.
మండలంలో ఇప్పటివరకు 65 శాతం ఎన్యూమరేషన్ దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు కాగా, మరో 35 శాతం దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ఆమె తెలిపారు. గడువు ముగియడానికి కేవలం పది రోజులే మిగిలి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఫారాలు పూర్తి చేయాలని సూచించారు.
చివరి రోజుల్లో సర్వర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ నెల 20వ తేదీలోపు ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బూత్ స్థాయి అధికారికి (బీఎల్‌వో) అందజేయాలని కోరారు.
ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, బూత్ స్థాయి అధికారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, యువత చొరవ చూపాలని తహసీల్దార్ సూచించారు. తమ పరిధిలో ఇంకా ఫారం నింపని ఓటర్లను గుర్తించి వెంటనే నమోదు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
"ఓటు హక్కు ప్రతి పౌరుడి అమూల్యమైన హక్కు. నిర్లక్ష్యంతో దానిని కోల్పోవద్దు. ప్రతి అర్హుడూ తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి" అని తహసీల్దార్ సునీత స్పష్టం చేశారు.

# ఉత్తమ పాత్రికేయ అవార్డు గ్రహీత భాశెట్టి హరీష్‌కు ఘన సన్మానం

## -మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అభినందనలు



మెట్‌పల్లి , నేటిధాత్రి:
ఇటీవల శ్రీకాళహస్తిలో ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకున్న జగిత్యాల జిల్లా ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు భాశెట్టి హరీష్ను మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు తన కార్యవర్గ సభ్యులతో కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా మైలారపు రాంబాబు మాట్లాడుతూ, ప్రజలకు--ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పాత్రికేయుల్లో భాశెట్టి హరీష్ ఒకరని కొనియాడారు. ఆర్యవైశ్య సమాజానికి చెందిన వ్యక్తి జగిత్యాల జిల్లా ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడిగా సేవలందిస్తూ ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకోవడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు అందుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్మి రవికుమార్, వాసవి దేవాలయ అధ్యక్షుడు చాడ సురేష్, వాసవి గార్డెన్ అధ్యక్షుడు కోట కిరణ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి నవీన్ కుమార్, చైతన్యనగర్ వాడకట్టు 2 అధ్యక్షుడు బండారి గోపీకృష్ణ, జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు సామ అమర్ తదితరులు పాల్గొని భాశెట్టి హరీష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# దండి లక్ష్మి-కొమురయ్యలను మర్యాదపూర్వకంగా కలిసిన కొంగర ప్రభాకర్

హుస్నాబాద్, నేటిధాత్రి:
హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, ఆమె భర్త కొమురయ్యలను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొంగర ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలియజేశారు.
అనంతరం స్థానిక అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సేవలందించే అంశాలపై పరస్పరం చర్చించారు. ప్రజా ప్రయోజనాల కోసం సమిష్టిగా పనిచేయాలని అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో సంపత్ నాయక్‌తో



పాటు పలువురు తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొని దండి లక్ష్మి--కొమురయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బర్ల సూరి నీ సన్మానించిన మెట్పల్లి మున్సిపల్ చైర్మన్



మెట్ పల్లి , నేటిధాత్రి:
జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన బర్ల సూరిను రాష్ట్ర నాయకత్వం శనివారం నియమించింది. ఈ సందర్భంగా మెటపల్లి చైర్ పర్సన్ మైలారపు లింబాద్రి గారు మరియు కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఎండి రైస్ మరియు పలువురు వార్డ్ కౌన్సిలర్లు అభినందనలు తెలియజేసి సన్మానించడం జరిగింది.

# వాన చినుకమ్మ...నేల చిన్న పోయినది చూడమ్మ...

వీణవంక, నేటిధాత్రి:
వీణవంక మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రజలు మంగళవారం కప్పతల్లి ఆటలు ఆడుతూ, వన దేవతలకు జలాభిషేకాలు చేశారు, అనంతరం గ్రామ సర్పంచ్ గజ్జల మొగులయ్య మాట్లాడుతూ...గ్రామాలు అభివృద్ధి చెందాలంటే వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు కుంటలు బావులు నిండుకుండలా నీళ్లు ఉండి,పాడి పంటలు సమృద్ధిగా పండాలని రైతుల కళ్ళల్లో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు, వారి ఆధ్వర్యంలో కప్పను కర్రకు కట్టి ఊరంతా తిప్పుతూ కప్పతల్లికి పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు కప్ప పై నీళ్లు పోసి, గ్రామ దేవతలకు సైతం గంగాజలంతో అభిషేకం చేసి కొబ్బరికాయలు కొట్టి వాన దేవునికి మొక్కులు చెల్లించారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు యువకులు తదితరులు



పాల్గొన్నారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999